విలేకరులు కావలెను
TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143



TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను
TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143



సంపుటి: 16 | సంచిక : 67 | గురువారం 25. 6. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


# కేసీఆర్ అప్పులు చెల్లిస్తూనే సంక్షేమ పథకాలు అమలు

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- పదేళ్లపాటు అడ్డగోలుగా రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్
- ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న రైతు ఆశీర్వాద మహాసభ
- ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కేసీఆర్ కుటుంబం లక్ష కోట్ల అవినీతి
- సొంత పేపర్, సోషల్ మీడియాలో అడ్డగోలు అబద్ధాలు



# నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించం

## పార్టీ నేతలకు ముఖ్యమంత్రి రేవంత్ వార్నింగ్

- పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తాం.
- లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తాం
- ఎస్ఐఆర్‌పై సర్పంచ్‌లతో గ్రామాల్లో ప్రచారం చేయాలి
- ఓటర్ల హక్కులను కాపాడటంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలి

ఎస్ఐఆర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను క్షమించే ప్రసక్తి లేదని, పనిచేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తాం.. లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై సర్పంచ్‌లతో గ్రామాల్లో ప్రచారం చేయించాలని సూచించారు. తెలంగాణలో రేపటి నుంచి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) ప్రారంభం కానుండడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి, భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి పాల్గొన్నారు.

హైదరాబాద్ తెలంగాణ వాణి)






# తెలంగాణ నీటిని కర్ణాటకకు తాకట్టు పెట్టే హక్కు ఎవరిచ్చారు?

సీఎంకు మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ

# హర్మూజ్‌లో ఎటువంటి సుంకాల్లేవ్ - ట్రంప్



హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. జలసంధి మార్గంలో ప్రయాణించే నౌకల నుంచి ఎటువంటి సుంకాలు, బీమా ఖర్చులు లేదా ఇతర ఏవిధమైన రుసుములూ వసూలు చేయమని ఇరాన్ హామీ ఇచ్చిందన్నారు. ఒకవేళ ఇది తప్పుడు సమాచారమైతే, వారితో చర్చలను వెంటనే నిలిపివేస్తామన్నారు.

ఇక ఇరాన్‌కు నేరుగా ఎటువంటి నిధులు విడుదల చేయడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. మొక్కజొన్న, గోధుమ, సోయాబీన్ తదితర ఆహార పదార్థాలను కొనుగోలు చేసేందుకు వారికి (ఇరాన్‌కు) సంబంధించిన నిధుల్లోంచి కొంత మొత్తాన్ని అమెరికా రైతులు, పశుపోషకులకు విడుదల చేస్తామని అన్నారు. ప్రస్తుతం ఇరాన్‌కు ఆహార పదార్థాలు అత్యవసరమని, వాటిని ప్రత్యేకంగా అమెరికా నుంచే కొనుగోలు చేసి సరఫరా చేస్తామన్నారు.

హైదరాబాద్ తెలంగాణ వాణి)

# బోనాల పండుగ ఘనంగా నిర్వహిస్తాం

- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- ఈసారి 20 కోట్లు కేటాయించాలని కోరాం.
- భారీ ఎత్తున ఏర్పాటు చేసే అత్యంత వైభవంగా బోనాల ఉత్సవాలు
- బోనాల జాతరలో ఈసారి ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు
- ఫ్రీ బస్సు ఉండడంతో మహిళలు ఎక్కువగా వచ్చే అవకాశం





# కార్మికుల హక్కులు, గౌరవాన్ని పరిరక్షించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జి. వివేక్ వెంకట్ స్వామి
- మంత్రిని కలిసిన ఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి



# గ్లోబల్ ఖాకీగా 'భారత్'

ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు కీలక బాధ్యతలు

ఎఫ్‌ఏటీఎఫ్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా మధ్యప్రదేశ్ ఐఏఎస్ 3

# 891 మంది తెలంగాణ ఉద్యోగులను రిలీవ్ చేస్తాం

- చేర్చుకోవద్దని ఉద్యోగ సంఘాల డిమాండ్
- ఆర్థిక భారంతో పాటు ప్రమోషన్లు దెబ్బతింటాయని ఆవేదన
- ముందు ఇక్కడున్న ఏపీ ఉద్యోగులను పంపాలని విజ్ఞప్తి
- తెలంగాణ ప్రభుత్వ నిర్ణయంపై నెలకొన్న ఉత్కంఠ

# నేను రాజకీయాల్లో ఏది మాట్లాడినా ట్రోల్ చేస్తున్నారు

హైదరాబాద్ తెలంగాణ వాణి)



రాజకీయాల్లో ఏది మాట్లాడినా తన మీద సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్ చేస్తున్నారని టీఆర్ఎస్ చీఫ్ కవిత అన్నారు. ఆడవాళ్లు రాజకీయాల్లోకి వస్తే ఇలానే టార్గెట్ చేస్తారనే భావనతోనే కొందరు కావాలనే ఈ ట్రోలింగ్స్‌కు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికీ ప్రపంచంలో జెండర్ బయాస్ (లింగ వివక్ష) కొనసాగుతోంది. అనేక రంగాల్లో మగవారికే ప్రాధాన్యత లభిస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో కులాల కంటే.. మగవారి కులం, ఆడవారి కులం అనే రెండు మాత్రమే ఉన్నాయనిపిస్తోందని కవిత వ్యాఖ్యానించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో జరిగిన వేట విమెన్ ఎంపవర్‌మెంట్ సమ్మిట్‌లో మాట్లాడిన కవిత.. సమాజంలో, రాజకీయాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై ఆమె ఎమోషనల్ అయ్యారు సపోర్ట్ ఇవ్వాలని కోరారు.

# బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌కు బెయిల్



హైదరాబాద్ తెలంగాణ వాణి)

బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇద్దరి పూచీకత్తులతో ఆయనకు బెయిల్ ఇచ్చింది. మే 26న తెలంగాణభవన్‌లో జరిగిన నిర్వహించిన సమావేశంలో బాల్క సుమన్ మాట్లాడారు. అందులో నాంపల్లిలోని సింగరేణి భవన్‌తోపాటు మందమర్రిలోని జీఎం కార్యాలయ అధికారులను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దీనిపై సింగరేణి భవన్ అధికారులు నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో పోలీసులు ఆయన్ను తెలంగాణ భవన్‌లో అరెస్టు చేశారు. ఈ కేసులో బాల్క సుమన్‌కు తాజాగా బెయిల్ మంజూరైంది.

## చెట్ల కొమ్మలతో ట్రాన్స్‌ఫార్మర్‌కు ముప్పు ,స్థానికుల్లో భయం

### పట్టించుకోని అధికార యంత్రాంగం

**జూలూరుపాడు: జూన్ 24 ( తెలంగాణ వాణి):**



మండల కేంద్రంలో ఉన్న వెంగన్నపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్‌బీఐ బ్యాంకు, అటవీశాఖ కార్యాలయం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెట్లు విపరీతంగా పెరిగి, వాటి కొమ్మలు ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకే స్థితికి చేరుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని పెరిగిన చెట్లు, విద్యుత్ తీగలకు దగ్గరగా ఉండటంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఈదురుగాలులు, వర్షాల ప్రభావంతో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడే ప్రమాదం ఉందని, దీనివల్ల షార్ట్‌సర్క్యూట్లు, విద్యుత్ అంతరాయాలు, అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజల రాకపోకలు అధికంగా ఉండే రద్దీ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ప్రమాదం సంభవిస్తే తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అందువల్ల గ్రామపంచాయతీ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది సమన్వయంతో వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి తగిన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా ముందస్తు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించాలని మండల వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పదు

### సబ్ ఇన్స్పెక్టర్ జీనత్ కుమార్

**జూలూరుపాడు : జూన్ 24 ( తెలంగాణ వాణి):**



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, డీఎస్పీ కొత్తగూడెం జిల్లా సీఐ జూలూరుపాడు ఆధ్వర్యంలో జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయాలపై ప్రత్యేక నిఘా మరియు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ జీనత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించే డీలర్లు, దుకాణదారులు మాత్రమే కాకుండా సంబంధిత కంపెనీలపై కూడా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు విత్తనాలు విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.దుకాణాలలో ఉన్న స్టాక్‌ను రోజువారీగా నమోదు చేయడంతో పాటు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు--అమ్మకాల బిల్లులు తనిఖీ సమయంలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. రికార్డుల్లో నమోదు చేసిన వివరాలు మరియు దుకాణంలో ఉన్న స్టాక్ మధ్య ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదన్నారు. విత్తనాలను ఎంఆర్పీ ధరలకు మించి విక్రయించరాదని, రైతులు కొనుగోలు చేసిన ప్రతి విత్తనానికి సంబంధించి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. రైతులు కోరిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, గ్రామాల్లో తిరుగుతూ అనధికారికంగా విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకుని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని, నకిలీ విత్తనాల విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు జిల్లాలో పటిష్ట నిఘా కొనసాగుతోందని, అనుమానం ఉన్న సందర్భాల్లో డీలర్ల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

## శిల్పి నగర్ పార్కింగ్ స్థలంపై కన్నేసిన ఆక్రమణదారులు

### స్థానిక చిరు వ్యాపారులు తహశీల్దార్‌కు ఫిర్యాదు

**భద్రాచలం, జూన్ 24 (తెలంగాణ వాణి)**



భద్రాచలం పట్టణంలోని శిల్పినగర్ కాలనీలో ఉన్న పార్కింగ్ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తూ స్థానిక చిరు వ్యాపారులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. జనగం భాగ్యలక్ష్మి నేతృత్వంలో వినతిపత్రం సమర్పించిన వ్యాపారులు, పార్కింగ్ స్థలంలో స్థంభాలు పాతి ముళ్లతీగల కంచె ఏర్పాటు చేశారని తెలిపారు. దీనిపై ప్రశ్నించగా అధికారుల అనుమతులు ఉన్నాయని సంబంధిత వ్యక్తులు చెబుతున్నట్లు పేర్కొన్నారు. భద్రాచలానికి వచ్చే పర్యాటకులు, భక్తుల వాహనాల పార్కింగ్‌పై ఆధారపడి అనేక మంది చిరు వ్యాపారులు జీవనం సాగిస్తున్నారని, పార్కింగ్ స్థలం తగ్గిపోతే తమ ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కరకట్ట నిర్మాణ సమయంలో అక్కడి కుటుంబాలను ఆదర్శనగర్‌కు తరలించిన విషయాన్ని గుర్తుచేస్తూ, ప్రస్తుతం స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అధికారులు వెంటనే విచారణ జరిపి అక్రమంగా ఏర్పాటు చేసిన ముళ్లకంచెను తొలగించి పార్కింగ్ స్థలాన్ని పరిరక్షించాలని, చిన్న వ్యాపారుల జీవనోపాధిని కాపాడాలని వారు కోరారు.

## టాటా ఏఐఏ ఇన్సూరెన్స్ కార్యాలయాన్ని ప్రారంభించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**చౌటుప్పల్, జూన్ 24 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో టాటా ఏఐఏ ఇన్సూరెన్స్ కార్యాలయాన్ని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్క కుటుంబానికి ఇన్సూరెన్స్ సౌకర్యం ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. కుటుంబ యజమాని అనుకోకుండా మరణిస్తే కుటుంబం రోడ్డున పడకుండా ఇన్సూరెన్స్ కుటుంబాలను కాపాడుతుంది అని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పావని రమేష్ గౌడ్ 13వ వార్డు కౌన్సిలర్ లు బత్తుల వాణి విప్లవ్ ఊడుగు జ్యోతి రమేష్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పబ్బు రాజు గౌడ్ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ,వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి , సీనియర్ బిజినెస్ అసోసియేట్ కొండ వెంకటరమణారెడ్డి, ఫణి కుమార్, దిల్సుక్నగర్ బ్రాంచ్ మేనేజర్ శ్యామ్ రావు, ట్రైనింగ్ ఆఫీసర్ శర్మ, ఏబీఎం మురళి, శ్రీధర్, శివం సింగ్, సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆత్మగౌరానికి అభివృద్ధికి తోడ్పడేలా నూతన భవన నిర్మాణం

**హుజూర్ నగర్ జూన్ 24 తెలంగాణ వాణి**



హుజూర్ నగర్ నియోజకవర్గ పరిధి మఠంపల్లి లోనే గ్రామ మహిళ సంఘ భవనం 2 కి భూమి పూజ చేసిన సర్పంచ్ ఏసు మల్ల వీరలక్ష్మి పాపయ్య ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందిందుకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుంది .ఇల్లాలే ఇంటికి దీపం అనే రీతిగా గ్రామ అభివృద్ధి నా లక్ష్యంగా పనిచేస్తానని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో. ఉపసర్పంచ్ కొత్తపల్లి శౌరి 5వ వార్డు మెంబర్ సాయి సుమంత్ రెడ్డి మహిళా సమైక్య సభ్యురాలు స్వరూప రాణి కృష్ణమోహన్ శాంత మామిడి లలిత తదితరులు పాల్గొన్నారు

# అనుమతులు లేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

### ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీని అరికట్టాలి.

**చౌటుప్పల్ జూన్ 24 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**



చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బుధవారం పీబీ గార్డెన్‌లో అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్ , పల్లె మధు, దిండు భాస్కర్, నలపరాజు రమేష్, కట్టెల లింగస్వామి, బండిగారి శ్రీధర్ హాజరై మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో కొనసాగుతున్న ఫీజుల దోపిడీ, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలు, విద్యాహక్కు చట్టం అమలులో జరుగుతున్న నిర్లక్ష్యం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులపై పెరుగుతున్న ఆర్థిక భారం వంటి అంశాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టం--2009ను ప్రైవేట్ విద్యాసంస్థలు తుంగలో తొక్కుతూ విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చాయని విమర్శించారు. అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, రవాణా ఛార్జీలు, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో ఇష్టారాజ్యంగా వేలాది రూపాయలు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు.

మండలంలో అనుమతులు లేకుండా కొన్ని పాఠశాలలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ అనుమతులు, మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు లేకుండా పాఠశాలలను నిర్వహించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని అన్నారు. ఇలాంటి పాఠశాలలను గుర్తించి వెంటనే గుర్తింపు రద్దు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కల్పించాల్సిన 25 శాతం ఉచిత సీట్ల అమలులో యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. అర్హులైన విద్యార్థులకు ఉచిత విద్య అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రైవేట్ పాఠశాలల అక్రమాలను అరికట్టాల్సిన విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనీ ,కొందరు అధికారులు యాజమాన్యాలకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని సమావేశం అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) పనితీరుపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యత నిర్ధారణ అయితే వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

సమావేశం ప్రధాన డిమాండ్లు

- ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని వెంటనే అరికట్టాలి.
- అడ్మిషన్, ట్యూషన్, రవాణా మరియు ఇతర అదనపు ఫీజుల వసూళ్లపై నియంత్రణ విధించాలి.
- పాఠశాలల ఫీజు నిర్మాణాన్ని పారదర్శకంగా ప్రజలకు ప్రకటించాలి.
- అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలను గుర్తించి వాటి గుర్తింపును వెంటనే రద్దు చేయాలి.
- ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- విద్యాశాఖ ప్రత్యేక బృందాలతో అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించాలి.
- ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- ప్రైవేట్ పాఠశాలలకు సహకరిస్తున్న అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.
- మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) పనితీరుపై విచారణ జరిపి బాధ్యత నిర్ధారణ అయితే వెంటనే సస్పెండ్ చేయాలి.
- విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం ఉచిత సీట్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలి.
- అర్హులైన పేద విద్యార్థులకు ఉచిత విద్య అందేలా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి.

ప్రభుత్వం వెంటనే స్పందించి పై డిమాండ్లను అమలు చేయకపోతే విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజాసంఘాలు, తల్లిదండ్రుల సంఘాలతో కలిసి మండల, జిల్లా స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సమావేశం హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో ఒంటెద్దు లింగస్వామి, ఖయ్యూం, రాఘవ, ఇర్ఫాన్, పందుల శరత్, లింగస్వామి, గంగాదేవి శివ, అత్తు, చింటూ, మాజీ రెడ్డి సాయి, శ్యాంసుందర్, చిలువేరు సైదులు, శివ, పల్చం శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్‌ఫోన్ లేని రైతుల పరిస్థితి ఏంటి?

- **యూరియా యాప్‌పై బీఆర్ఎస్ విమర్శలు**
- **బీఆర్ఎస్ మండల కన్వీనర్ : దొడ్డి తాతారావు**

**చర్ల, జూన్ 24 ( తెలంగాణ వాణి):**



యూరియా పంపిణీ కోసం ప్రవేశపెట్టిన యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, గతంలో మాదిరిగానే ఎలాంటి షరతులు లేకుండా రైతులకు యూరియా అందించాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు. చర్లలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. యూరియా యాప్ వల్ల గిరిజన రైతులు, గ్రామీణ ప్రాం తాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. చాలా గ్రామాల్లో మొబైల్ సిగ్నల్ సమస్య ఉండగా, ప్రతి రైతు వద్ద స్మార్ట్‌ఫోన్ కూడా ఉండదని పేర్కొన్నారు. యాప్ ద్వారా మాత్రమే యూరియా అందిస్తే రైతులు ఇబ్బందులు పడతారని ఆం దోళన వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైనంత యూరియా అందుబాటులో ఉంచి, సులభంగా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సయ్యద్ అజీజ్, పంజా రాజు, కాకి అనిల్, తడికల బుల్లబ్బాయి, గోరెంట్ల వెంకటేశ్వరరావు, కారం కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీని బలోపేతం చేయాలి.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- **ప్రతిపక్షంలో ఉన్న అధికార పక్షంలో ఉన్న నియోజకవర్గ అభివృద్ధిలో మాత్రం రాజీ పడలేదు పడను**
- **మండల, పట్టణ అధ్యక్షుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

**చౌటుప్పల్, జూన్ 24 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**





నాయకుడనే వాడు ప్రజలకు దగ్గరగా ఉండి వారి బాధలు విని వారిని గౌరవించినప్పుడే నాయకుడిగా ప్రజల్లో మనగలుగుతాడని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం చౌటుప్పల్ పట్టణంలోని లక్కారంలో వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతనంగా ఎంపికైన చౌటుప్పల్ మండల అధ్యక్షుడు, చౌటుప్పల్ పట్టణ అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై ఇరువురిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ స్థాయిలో, మండల స్థాయిలో పట్టణ స్థాయిలో, నియోజక వం స్థాయిలో అందరం కలిసికట్టుగా పనిచేస్తేనే సరైన ఫలితాలు వస్తాయని 2018 ఎన్నికల్లో మొత్తం టిఆర్ఎస్ పార్టీ గెలిస్తే మునుగోడు లో మాత్రం కాంగ్రెస్ పార్టీ గెలిచిందని గుర్తు చేశారు.. అందరూ కష్టపడతారని రాజకీయాలలో ఉండేవారు ఓపికతో పనులు చేసుకుంటూ పోతే పదవులు వస్తాయని అన్నారు. నాయకుడనేవాడు వ్యక్తిగతంగా మంచివాడ కాదా ప్రజలకు అందుబాటులో ఉంటున్నాడా లేదా ప్రజలకు మంచి పనులు చేస్తున్నాడా లేదా అని ప్రజలు సునిశితంగా గమనిస్తున్నారని అన్నారు. గెలిచిన తర్వాత ప్రవర్తనలో మార్పు వస్తే వచ్చేసారి ప్రజల తీర్పు వ్యతిరేకంగా ఉంటుందని గుర్తు చేశారు. ప్రతి నాయకుడు ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు. నూతనంగా ఎన్నికైన చౌటుప్పల్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్ , చౌటుప్పల పట్టణ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి లు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ రాజగోపాల్ రెడ్డి ని శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, నియోజకవర్గ సమన్వయకర్త ఇన్చార్జి పబ్బు రాజు గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు , మాజీ జెడ్పిటిసి సభ్యుడు చిలుకూరు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు ,మండల ముఖ్య నాయకులు, మున్సిపల్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడా రంగంలో ములుగు జిల్లా సత్తా చాటుతోంది

- **క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రజా ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుంది**
- **క్రీడాకారుల కోసం అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు**
- **రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్క**

**ములుగు, జూన్24 (తెలంగాణ వాణి)**




క్రీడా రంగంలో ములుగు జిల్లా సత్తాను చాటుతుందని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ములుగు క్రీడాకారులు రాణిస్తున్నారని, క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రజా ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని ,క్రీడాకారుల కోసం అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు బుధవారం ములుగు ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, భారత ఒలింపిక్ సంఘం, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ తో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లా మారుమూల ప్రాంతం అయినప్పటికీ క్రీడా రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో గుర్తింపు పొందుతోందన్నారు. జిల్లాకు చెందిన అనేక మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచి దేశ విదేశాల్లో ములుగు ఖ్యాతిని చాటుతున్నారని తెలిపారు పేదరికం వెనుకబడిన పరిస్థితులు ఉన్నప్పటికీ జిల్లాలోని పిల్లల్లో ఉన్న ప్రతిభ అపారమని,వాలీబాల్,ఆర్చరీ వంటి క్రీడల్లో ములుగు జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించిన చరిత్ర ఉందన్నారు. క్రికెట్ సహా ఇతర క్రీడల్లో కూడా విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు.జిల్లాలో క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అథ్లెటిక్స్ స్టేడియం ఏర్పాటు కోసం వచ్చిన ప్రతిపాదన మేరకు రూ.4 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయించామని, భవిష్యత్తులో అవసరమైన అదనపు సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉండటంతో పాటు క్రీడలపై పూర్తి ఏకాగ్రతతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి విద్యార్థి తాను ఎంచుకున్న క్రీడలో విజయం సాధించి ములుగు జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని,తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షిస్తూ మంత్రి అనసూయ సీతక్క శుభాకాంక్షలు తెలిపారు.



## వికలాంగుడు ఇడమయ్యకు చేయూత

### మానవత్వం చాటిన మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు

**చర్ల, జూన్ 24 (తెలంగాణ వాణి):**

చర్ల మండలంలోని మారుమూల బక్కచింతలపాడు గ్రామానికి చెందిన వికలాంగుడు ఇడమయ్య కుటుంబానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు అండగా నిలిచారు. రెండు కాళ్లు కోల్పోయి, చేతులు కూడా సరిగా పనిచేయని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న ఇడమయ్య కుటుంబం గురించి తెలుసుకున్న ఆయన బుధవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా క్వింటా బియ్యంతో పాటు పది రోజుల పాటు సరిపడే నిత్యావసర ముడి సరుకులు అందజేసి, రూ.2 వేల నగదు సహాయం చేశారు. అలాగే ఇడమయ్యకు వికలాంగుల పింఛన్ మంజూరు అయ్యేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఇడమయ్య కుటుంబానికి దాతలు, సేవా సంస్థలు ముందుకు వచ్చి సహాయం చేయాలని ఇర్ప శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న కుటుంబానికి అందుతున్న సహాయం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల నాయకులు శ్యామల తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలకు ఎంఈఓ వార్నింగ్

### ప్రవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

**చౌటుప్పల్, జూన్ 23 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**



చౌటుప్పల్ మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, లేనిపక్షంలో పాఠశాలల గుర్తింపు రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి (ఎంఈఓ) గురువారావు హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు ఆయన అధికారిక నోటీసు జారీ చేశారు.

పాఠశాలల సక్రమ నిర్వహణకు మున్సిపాలిటీ లేదా గ్రామపంచాయతీ నుంచి నిరాక్షేపణ పత్రం (ఎన్ఓసీ), భవన పటిష్టత ధ్రువీకరణ పత్రం, అగ్నిమాపక శాఖ అనుమతి, పారిశుధ్య ధ్రువీకరణ పత్రం, ట్రాఫిక్ పోలీస్ శాఖ నుంచి ఎన్ఓసీ తప్పనిసరిగా ఉండాలని నోటీసులో పేర్కొన్నారు.ఒకటి కంటే ఎక్కువ బ్రాంచీలు నిర్వహిస్తున్న పాఠశాలలు ప్రభుత్వ ప్రత్యేక అనుమతి పొందాలని, పాఠశాల పరిధిలో ఆటస్థలం ఉండాలని, విద్యార్థులను రవాణా చేసే బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అలాగే పాఠశాల గుర్తింపు గడువు ముగిసిన వెంటనే రెన్యువల్ చేయించుకోవాలని, భవనానికి సంబంధించిన పత్రాలు, లీజ్ డాక్యుమెంట్లు సక్రమంగా ఉండాలని స్పష్టం చేశారు.పాఠశాలల ప్రాంగణంలో టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్, షూస్, టైలు, బెల్టులు, ఇతర స్టేషనరీ సామగ్రి విక్రయించరాదని పేర్కొన్నారు. వీటితో పాటు అన్ని రకాల ప్రభుత్వ అనుమతులు, నిబంధనలు పాటించాల్సిందేనని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, అవసరమైన అనుమతులు లేకపోయినా, పాఠశాలల గుర్తింపును రద్దు చేయడంతో పాటు సీజ్ చేస్తామని నోటీసు ద్వారా హెచ్చరించారు.

## కస్తూరిభాగాంది జూనియర్ కాలేజీలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు చేసుకొండి

**కన్నాయిగూడెం జూన్24 (తెలంగాణ వాణి)**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ముప్పనపల్లి గ్రామంలో ఉన్న కన్నాయిగూడెం కస్తూరిభాగాంది జూనియర్ కాలేజీలో ఎంపీసీ మరియు బైపిసి గ్రూపులకు సంబంధిత పోస్టులకు తాత్కాలిక పద్ధతిలో తీసుకోవడం జరుగుతుంది ఖాళీగా ఉన్న పోస్టులు తెలుగు -1 ,ఇంగ్లీష్ -1 మాథ్స్ -1 ,ఫిజిక్స్ -1 కెమిస్ట్రీ -1 బాటిని -1, జువాలజీ -1 మొత్తం ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి .దీనికి సంబంధించిన పోస్టులను తాత్కాలికంగా తీసుకోవడం జరుగుతుంది. అర్హులు: బిఇడి మరియు పీజీ (ఎక్స్పిరియన్స్)సంబంధిత ధ్రువీకరణ పత్రాలను 25 జూన్ 2026 నుండి 29 జూన్ 2026 వరకు స్పెషల్ ఆఫీసర్ జె. అశ్వినికి ఇవ్వగలరు సమాచారం కోసం కాంటాక్ట్ 9121606721 కి సంప్రదించండి

## ఎమర్జెన్సీ నీడలు: యాభై ఏళ్ల తర్వాత ప్రజాస్వామ్య వాస్తవాలు




జూన్ 25 అనగానే భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి అధ్యాయం గుర్తుకొస్తుంది. 1975లో విధించిన ఎమర్జెన్సీ ప్రజల స్వేచ్ఛను, పత్రికల హక్కులను, ప్రతిపక్షాల గొంతుకలను అణిచివేసిన కాలంగా చరిత్రలో నిలిచిపోయింది. అధికారాన్ని ప్రశ్నించడం నేరంగా మారిన ఆ రోజులను ప్రతి సంవత్సరం గుర్తు చేసుకుంటూ ఉంటాం. కానీ యాభై సంవత్సరాల తర్వాత ఈ రోజున మనం గతాన్ని మాత్రమే తలుచుకోవాలా? లేక వర్తమానాన్ని కూడా ప్రశ్నించాలా? అని దేశం ముందున్న అసలు ప్రశ్న.

ఎందుకంటే ఎమర్జెన్సీ అంటే కేవలం రాజ్యాంగంలోని ఒక అధికరణాన్ని అమలు చేయడం కాదు. ప్రజలలో భయం పెరగడం కూడా ఎమర్జెన్సీయే. అధికారాన్ని ప్రశ్నించడానికి ప్రజలు వెనుకాడటం కూడా ఎమర్జెన్సీయే. మీడియా స్వేచ్ఛగా మాట్లాడలేకపోవడం కూడా ఎమర్జెన్సీయే. ప్రజా సమస్యల కంటే ప్రభుత్వ ప్రతిష్ఠ పెద్దదిగా మారడం కూడా ఎమర్జెన్సీయే. ఈ కోణంలో చూస్తే దేశం మొత్తం ఒక అసౌకర్యకరమైన ప్రశ్నను ఎదుర్కొంటోంది. నిజంగా 1975 ముగిసిపోయిందా? లేక దాని నీడ ఇంకా మన చుట్టూనే తిరుగుతోందా?

ఒకప్పుడు పత్రికలపై ప్రత్యక్ష సెన్సార్ ఉండేది. నేడు సెన్సార్ రూపం మారింది. అధికారాన్ని ప్రశ్నించే మీడియాను దేశ వ్యతిరేకిగా చిత్రీకరించే సంస్కృతి పెరిగింది. అసలు వార్త కంటే ప్రచారం పెద్దదిగా మారింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల కంటే నాయకుల ఇమేజ్ నిర్వహణకు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. నిజం చెప్పేవారిని వినే బదులు, అసౌకర్యకరమైన ప్రశ్నలను మౌనంలోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆందోళన దేశవ్యాప్తంగా వినిపిస్తోంది.

ఈ పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మార్చేది ప్రజల జీవితాల్లో కనిపిస్తున్న వాస్తవం. పెరుగుతున్న నిరుద్యోగం, రైతుల ఆర్థిక కష్టాలు, మధ్యతరగతి మీద పెరుగుతున్న భారం, ధరల పెరుగుదల వంటి సమస్యలు ప్రజలను వెంటాడుతున్నాయి. కానీ ఈ సమస్యలపై చర్చ జరగాల్సిన స్థానాన్ని రాజకీయ ప్రచారం ఆక్రమిస్తోంది. ప్రజల ప్రశ్నలకు సమాధానాలు రావడం లేదు. బదులుగా రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు మాత్రమే వినిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. కానీ ఇప్పుడు ప్రజలే తమ సమస్యలను నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఎమర్జెన్సీని గుర్తు చేస్తుంది. అది సరైనదే. ఎందుకంటే ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్యానికి మచ్చ. కానీ అదే సమయంలో ప్రజాస్వామ్యం అంటే కేవలం గత తప్పులను గుర్తు చేయడం కాదు. వర్తమానంలోనూ ప్రజాస్వామ్య విలువలను కాపాడడం. అధికారాన్ని విమర్శించే స్వరాలను గౌరవించడం. మీడియా స్వేచ్ఛను రక్షించడం. రాజ్యాంగ సంస్థల స్వతంత్రతను కాపాడడం. ఈ ప్రమాణాలపైనే ఏ ప్రభుత్వమైనా అంచనా వేయబడాలి.

అదే ప్రశ్న రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా వర్తిస్తుంది. తెలంగాణలో ప్రజలు మార్పు కోసం ఓటు వేశారు. కొత్త ఆశలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ప్రజల్లో నమ్మకాన్ని పెంచాయి. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఆశించిన వేగంతో ఫలితాలు కనిపించకపోవడం అసంతృప్తికి కారణమవుతోంది. రైతులు ఇంకా తమ సమస్యలను చెబుతున్నారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తోంది. మహిళలు ప్రకటించిన పథకాల పూర్తి అమలును కోరుతున్నారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది పోయి రాజకీయ ప్రచారం కొనసాగితే ప్రజల్లో నిరాశ పెరగడం సహజం.

ఒక సాధారణ రైతు మాటలో చెప్పాలంటే సమస్య చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఎన్నికల సమయంలో నాయకులు ఇంటి వద్దకు వస్తారు. గెలిచిన తర్వాత సమస్యలు మాత్రమే మిగులుతాయి. అప్పు తీర్చుకోవాలి. పంట పండించాలి. పిల్లలను చదివించాలి. కానీ ప్రభుత్వాలు మారినా రైతు బాధ మాత్రం మారడం లేదు. ఇదే పరిస్థితి నిరుద్యోగ యువతది. ప్రతి ఎన్నికలో ఉద్యోగాల హామీలు వింటారు. ప్రతి ప్రభుత్వ మార్పులో కొత్త ఆశలు పెంచుకుంటారు. చివరకు సంవత్సరాలు గడిచినా ఉద్యోగం కోసం నిరీక్షణ కొనసాగుతూనే ఉంటుంది. ఈ నిరాశే ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని బలహీనపరుస్తుంది.

ఎమర్జెన్సీ మనకు నేర్పిన అతిపెద్ద పాఠం ఏమిటంటే ప్రజాస్వామ్యాన్ని ఒక్కరోజులో నాశనం చేయలేరు. కానీ ప్రజల ఆశలను నిర్లక్ష్యం చేస్తూ, ప్రశ్నలను భరించలేక, విమర్శలను అణిచివేస్తూ నెమ్మదిగా బలహీనపరచవచ్చు. అందుకే జూన్ 25 కేవలం చరిత్రలో జరిగిన ఒక సంఘటన కాదు. అధికారంలో ఉన్న ప్రతి ప్రభుత్వానికి ఒక హెచ్చరిక. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజల మీదే ప్రయోగించవద్దనే హెచ్చరిక. ప్రజాస్వామ్యాన్ని కేవలం ఎన్నికలకే పరిమితం చేయవద్దనే హెచ్చరిక. ప్రజల గొంతు వినిపించకుండా చేసే ప్రతి ప్రయత్నం చివరికి చరిత్రలో ఎమర్జెన్సీ రూపంలోనే గుర్తుండిపోతుందనే హెచ్చరిక.

యాభై సంవత్సరాల క్రితం ప్రజాస్వామ్యం జైలుకెళ్లింది. నేడు ప్రజాస్వామ్యం జైలులో లేకపోవచ్చు. కానీ ప్రజల ప్రశ్నలు వినిపించకపోతే, ప్రజల సమస్యలు పరిష్కారం కాకపోతే, ప్రజల ఆశలు నెరవేరకపోతే, ప్రజాస్వామ్యం నిజంగా స్వేచ్ఛగా ఉందని ఎలా చెప్పగలం?ప్రశ్నించే హక్కును కోల్పోయిన రోజున ప్రజాస్వామ్యం తన ప్రాణం కోల్పోతుంది”

అదే జూన్ 25 మనకు వేసే ప్రశ్న. అదే ప్రశ్నకు కేంద్రం, రాష్ట్రం, ప్రతిపక్షం, మీడియా, సమాజానికి అందరూ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.



**సామాజిక విశ్లేషకులు**
**గంగుల రాజిరెడ్డి**
**9908351557**

## రైతు సంఘం ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీ

**మెదక్ / టేక్మాల్ జూన్ 24 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**



రైతు ఉత్పత్తిదా రుల సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బోడ్మట్ పల్లి గ్రామంలో ఐ ఎం ఆర్ ద్వారా పంపిణీ చేయబడిన విత్తనాలను మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, సర్పంచ్ అవినాష్ కుమార్ చేతుల మీదిగా పలువురు రైతులకు అందించారు. హైదరాబాదులోని ఐసిఏఆర్, ఐ ఐఎం ఆర్ ల సమక్షంలో రైతులు చిరుధాన్యాలు అపరాల పంటలు పండించాలన్న సదుద్దేశంతో జొన్నలు, కందులను రైతు సంఘం సీఈఓ డాకూరి వెంకటేశం సమక్షంలో ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వాణిజ్య పంటలే కాకుండా పప్పు దినుసుల పంటలు, చిరుధాన్యాల పంటలు రైతులు పండించాలని సూచించారు. ఇందులో వార్డు సభ్యులు, రైతు సంఘం డైరెక్టర్లు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం

**వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ( శాట్స్ ) చైర్మన్ శివసేన రెడ్డి**

**వనపర్తి , జూన్ 24, (తెలంగాణ వాణి ప్రతినిధి ):**




కేంద్రంలో బిజెపి ప్రభుత్వం విద్యార్థి భవిష్యత్తుతో చెలగాటమాడుతుందని, యువతను విస్మరిస్తే బిజెపి ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని ఘాటుగా విమర్శించారు. యువత దేశానికి వెన్నెముక వంటిదిని, ఆ యువతే భారత దేశ భవిష్యత్తు అని డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛాత్రోన్ కి గుంజ్” నినాదంతో విద్యార్థుల సమస్యలపై గళమెత్తాలన్నారు.అలాగే ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల రద్దులు, ఉద్యోగ నియామకాలలో జాప్యం, పెరుగుతున్న నిరుద్యోగం, విద్యా వ్యవస్థలో నెలకొన్న వైఫల్యాలపై విద్యార్థులు, యువత గళమెత్తాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఛాత్రోన్ కి గుంజ్ నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల రద్దులు విద్యార్థుల కష్టాన్ని వృథా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది ఖాళీ ఉద్యోగాలు ఉన్నప్పటికీ నియామక ప్రక్రియలు ఆలస్యం కావడం వల్ల యువత నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తు, ఉద్యోగ అవకాశాలు, నాణ్యమైన విద్య వంటి అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం యువత ఐక్యంగా ముందుకు రావాలని సూచించారు. “విద్య, ఉద్యోగాలు, భవిష్యత్తు కోసం విద్యార్థుల గొంతుక దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించాలి. అదే ‘ఛాత్రోన్ కి గుంజ్’ లక్ష్యం” ముందుకెళ్లా లన్నారు. విద్యార్థులను సంక్షోభంలోకి బిజెపి నెట్టేసిందని నీట్ పరీక్ష ఎంత ఖర్చు చేస్తుందో, కేంద్ర ప్రభుత్వం విద్యకు కేటాయించిన బడ్జెట్ కంటే మూడు వంతులు విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లితండ్రులు ఖర్చు చేస్తున్నారన్నారు. ఇప్పటికే పార్టీలకు అతీతంగా విద్యార్థులు దేశ రాజధానిలో ధర్నాలు రాస్తారోకోలు చేస్తున్న సంగతులను గుర్తు చేశారు. బిజెపి పార్టీ అధికారంకు వచ్చినప్పటి నుంచి విద్యావ్యవస్థ పుట్టింది అన్నట్లు మాట్లాడడం విడ్డూరకరమన్నారు. దేశంలో ఎస్ఎస్సి, యుపిఎస్సి, ఆర్ఆర్బి,జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల కోసం విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎంతో వ్యయ ఖర్చులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవహరించిన తీరే రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ వ్యవహరించిందని దుయ్యబడ్డారు. అలాగే దేశంలో విద్యార్థుల కోసం దేశ ప్రగతి కోసం పాటుపడిన నాయకుడు జవహర్ లాల్ నెహ్రూ అన్నారు. నెహ్రు ప్రధానిగా ఉన్న హయాంలోనే జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఐఐటీలు, ఏఐఐఎంఎస్, ఐఐఎం, యుజీసి, వంటి ప్రపంచ స్థాయి విద్యా సంస్థలకు పునాది పడింది. నేడు లక్షలాది మంది విద్యార్థులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, ఇంజనీర్లు ఈ సంస్థల ద్వారా దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న విషయాలను గుర్తు చేశారు. అలాగే రాష్ట్రంలో విద్యకు విశేష ప్రాధాన్యత ఇస్తూ కులాలకు అతీతంగా ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్కిల్ డెవలప్మెంట్, స్పోర్ట్స్ అథారిటీ యూనివర్సిటీ, నెలకొల్పేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాయి చరణ్ రెడ్డి,పిసిసి డెలిగేట్ తైలం శంకర్ ప్రసాద్, తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, బి కృష్ణ, ధనలక్ష్మి, సుఖేందర్ రెడ్డి, వాల్య నాయక్, శరవంద, పాండు సాగర్, నందిమల్ల చంద్రమౌళి, పాల్గొన్నారు.

## అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి 108 సిబ్బంది సకాలంలో చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు

**పెద్దపల్లి: జూన్,24 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**



పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన కొమ్ము రాజు కొమరయ్య రాత్రి సమయంలో ఇంటి బయట నిద్రిస్తున్న సమయంలో కురిసిన వర్షంలో పూర్తిగా తడిసి అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఆయన స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 అత్యవసర అంబులెన్స్ సేవలకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న సుల్తానాబాద్ 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని కొమరయ్య ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. గ్లూకోజ్ స్థాయిలను పరీక్షించగా అవి చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే రక్తపోటు కూడా ప్రమాదకర స్థాయిలో తగ్గినట్లు గమనించారు. వెంటనే 108 అత్యవసర వైద్య సేవల వైద్యుడు డాక్టర్ శివ సూచనల మేరకు డెక్స్ట్రోజ్-25డి గ్లూకోజ్ అందించి, ఆక్సిజన్ సపోర్ట్‌తో పాటు అవసరమైన ప్రథమ చికిత్సను అందించారు. అనంతరం మరింత వైద్యం కోసం కొమరయ్యను సురక్షితంగా సుల్తానాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

అంబులెన్స్ సిబ్బంది సకాలంలో స్పందించి అత్యవసర చికిత్స అందించడం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న కొమరయ్య ప్రాణాలు దక్కాయని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా కొమరయ్య భార్య వెంకటమ్మ, కుమార్తెలు గ్రామ ప్రజలు 108 అంబులెన్స్ సిబ్బంది సేవలను అభినందిస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర సమయంలో వేగంగా స్పందించి ప్రాణాలను కాపాడిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ దాసారపు సంపత్, అంబులెన్స్ పైలట్ గాండ్ల వెంకటేశ్వర్లును గ్రామస్థులు అభినందించారు.

## కలెక్టరేట్ అధికారులు స్వయంగా విచారణకు రావాల్సిందే!

- **ఎవరినో పంపి చేతులు దులుపుకుంటే కుదరదు**
- **చట్టాలు, కమీషన్ అంటే గౌరవం లేదా?**
- **ఆగ్రహించిన సమాచార కమీషన్ అధికారి పి.వి.శ్రీనివాస్ రావు**
- **లక్ష రూపాయల పరిహారం ఇప్పించండి సార్,చుక్క గంగారెడ్డి**

**జగిత్యాల/ బుగ్గారం :24 జూన్ (తెలంగాణ వాణి విలేకరి)**




జగిత్యాల జిల్లా బుగ్గారం నివాసి చుక్క గంగారెడ్డి సమాచార కమిషన్ కు దరఖాస్తు అందజేత, జగిత్యాల జిల్లా కలెక్టరేట్ అధికారులు బుధవారం తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ హైదరాబాద్ లో జరిగిన కేసుల విచారణకు హాజరు కాకుండా డిపివో కార్యాలయ సిబ్బందిని పంపడం అధికారులకు నోటీసులు పంపిస్తే జిల్లా పంచాయతీ అధికారులు చట్టాలను, కమీషన్ లను, ధర్మాసనాలను, తీర్పులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందని సమాచార అధికారి ( పి.వి శ్రీనివాసరావు )కమిషన్ తెలిపారు. అలా గౌరవించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్ అధికారులు సైతం స్వయంగా విచారణకు రావాల్సిందేనని, ఎవరినో పంపి చేతులు దులుపుకుంటే కుదరదు అని ఆయన తేల్చి చెప్పారు. ప్రజలు, ఆర్టీఐ కార్యకర్తలు చట్టబద్దంగా అడిగిన సమాచారాన్ని నిర్ణీత గడువు లోపల దరఖాస్తుదారులకు అందజేయాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. చుక్క గంగారెడ్డి కి సంబంధించిన నాలుగు కేసులను ఆయన బుధవారం క్షుణ్ణంగా విచారించారు. అందులో అధికారులు చేసిన పొరపాట్లను ఆయన ఎత్తి చూపారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రజా సమాచార అధికారులు ఈ కేసుల విచారణకు రావాల్సిందేనని ఆదేశించారు. తనకు చట్టబద్ధంగా ఒక్కొక్క కేసులో రూ. 25,000 చొప్పున నాలుగు కేసులకు కలిపి మొత్తం రూ. 1,00,000 ( ఒక లక్ష రూపాయల) పరిహారం బాధ్యులైన అధికారుల నుండి చట్టబద్ధంగా ఇప్పించాలని చుక్క గంగారెడ్డి బుధవారం సమాచార కమీషన్ కోరారు.

## హుజురాబాద్ నియోజవర్గ స్థాయి బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం

**హుజురాబాద్, జూన్ 24, (తెలంగాణ వాణి ప్రతినిధి ) :**



బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి గిన్నారపు మహేందర్ అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభంలో మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాన్యశ్రీ కాన్షీరాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి హాజరైన పల్లె ప్రశాంత్ గౌడ్ జోన్ ఇన్చార్జి ఈ సందర్భంగా మాట్లాడుతూ, రానున్న ఎన్నికల దృష్ట్యా బూత్ స్థాయి కమిటీలను బలోపేతం చేయాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బీఎస్పీ సిద్ధాంతాలను, బహుజన రాజ్య స్థాపన లక్ష్యాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ .అంబాల ప్రభాకర్ సీనియర్ నాయకులు దొడ్డే సమ్మయ్య, మారపెల్లి మోగిలయ్య, గరిగే చంద్రయ్య, ఈదునూరి రమేష్, రాచపెల్లి రమేష్, ఇల్లందుల రమేష్,రాజు అగ్నితేజ తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో హుస్నాబాద్ చిగురుమామిడి కళాకారుల ప్రదర్శన

**వీర బ్రహ్మంగారి చరిత్రతో ఆకట్టుకున్న కళాకారులు**

**హుస్నాబాద్ రూరల్, 24(తెలంగాణ వాణి )**



తెలంగాణ కళాకారుల అడ్డ అయినా రవీంద్రభారతిలో 99 రోజుల ప్రజా పాలన ప్రణాళిక కార్యక్రమంలో హుస్నాబాద్ చిగురు మామిడి మండలాలకు చెందిన కళాకారులు శ్రీ వీరబ్రహ్మం గారి నాటక ప్రదర్శన చేసి,వచ్చిన ప్రేక్షకులతో పాటు అధికారులను భక్తి పరవశ్యంలో ముంచారు వీర బ్రహ్మంగారి,కడప నవాబుల మధ్య జరిగే సన్నివేశాన్ని కళ్ళకు కట్టినట్టు వేశభూషణాలతో చాలా చక్కగా ప్రదర్శించారు వారి ప్రదర్శనను భాషా సంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి తో పాటు ఏఈఓ విజయ్ కుమార్ కళాకా రులను ప్రశంసించి వారికి ఘనంగా సన్మానం చేసి పాల్గొన్న కళాకారులందరికీ ప్రశంస పత్రాలతో సత్కరించారు ఈ కార్యక్రమంలో నిరుద్యోగ కళాకారుల సంఘం అధ్యక్షులు అనువోజు వెంకటేశం చిగురుమామిడి కళాకారుల మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్ ,పున్న రమేష్, కుతాడి కొమరయ్య, నిలిగొండ కిషన్,చందబోయిన పరశు రాములు, పోలోజు కుమార్ స్వామి, పిన్నింటి దాసు,మాచర్ల శ్రీను, శ్రీరామోజు రాములు, విధి మౌళి, నిలిగొండ సదానందం, పోలోజు రమేష్,సుంచు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు




## ఇందిర మహిళా శక్తి చీరాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న పిఏసీ చైర్మన్ అరేకపూడి గాంధీ

**హైదరాబాద్/ శేరిలింగంపల్లి జూన్ 24 (తెలంగాణవాణి విలేకరి)**

శేరిలింగంపల్లి వార్డు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఇందిర మహిళా శక్తి చీరాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే, పిఏసీ చైర్మన్ అరేకపూడి గాంధీ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు హమీద్ పటేల్ రాగం నాగేందర్ యాదవ్.నార్నె శ్రీనివాస్ రావు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ శేరిలింగంపల్లి జోన్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి, సీఓ పద్మ, సీఓ శ్రీకాంత్ తదితర అధికారులు, డ్వాక్రా సంఘ మహిళా సభ్యులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాల ఎస్ హెచ్ జి మహిళలకు చీరలను పంపిణీ చేశారు.మహిళల సంక్షేమం సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హత కలిగిన మహిళకు చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో ప్రవీణ్ కుమార్



**నాగిరెడ్డిపేట మండలం జూన్ 24:( తెలంగాణ వాణి ప్రతినిధి)**

నాగిరెడ్డి పేట మండలంలో చినూరు ప్రభుత్వ పాఠశాలను బుధవారం రోజున ప్రార్థన సమయానికి పాఠశాలకు చేరుకుని పాఠశాల విధి విధానాలు పరిశీలించారు . ఈ సందర్భంగా పాఠశాల ను ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడుతూ.... క్రమం తప్పకుండా పాఠశాలకు విద్యార్థులు హాజరు అయ్యేలా అలాగే విలువైన విద్య అదే విధంగా విద్యను అందించాలని సూచించారు. అలాగే పాఠశాలలను విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం ఎలా ఉందని తెలుసుకున్నారు . మిడ్ డే మీల్స్ మెనూ ప్రకారం ఆహారాన్ని అందిస్తున్నారా అని విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు . విద్యార్థులకు విలువైన విద్య, మధ్యాహ్నం భోజనం , విద్యాపరమైన ప్రయోజన విషయాలు అన్నియు సమర్థవంతంగా విద్యార్థులకు అందేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సలహాలు సూచనలు ఇచ్చారు . అనంతరం వాడి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సర్పంచ్ మహేందర్ తో కలిసి సందర్శించి పిల్లలతో ముచ్చటించారు. పిల్లలకు అందించే ఆహారాల వివరాలను తెలుసుకున్నారు . ఇట్టి కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి , ఉపాధ్యాయులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

## ఆత్మీయ పరామర్శ



**ధర్మారం: జూన్ 24 (తెలంగాణ వాణి)**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం లోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బద్దం గంగారెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గంగారెడ్డి ఇంటికి వెళ్లి మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గంగారెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కాంపల్లి రాజేశం, కొంగ భూమయ్య, జనగామ తిరుపతి, ఆవుల శ్రీనివాస్, అల్వాల రాజేశం, కోల శ్రీనివాస్, ఎనగందుల అశోక్ తదితరులు పాల్గొన్నారు

# నేరాల నియంత్రణ, ప్రజా భద్రత, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

**ఎస్పీ అశోక్ కుమార్**

**జగిత్యాల: జూన్ 24(తెలంగాణ వాణి ప్రతినిధి)**



ఆధునిక సౌకర్యాలతో పునరుద్ధరించిన మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో కల్పించిన సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ, భద్రతా చర్యలు, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్యాలయ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అంశాలపై సూచనలు చేశారు. పోలీస్ కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండటంతో పాటు, సిబ్బందికి అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా సేవల నాణ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.వార్షిక తనిఖీల్లో భాగంగా సర్కిల్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల సీడీ ఫైళ్లు, పెండింగ్ ట్రయల్స్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని, విధి విధానాల ప్రకారం కేసుల విచారణ చేపట్టాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని, సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను తరచూ తనిఖీ చేస్తూ సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని సీఐలకు ఆదేశించారు. అలాగే రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రతి నెలా తాజా సమాచారాన్ని సేకరించి నమోదు చేయాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు సైబర్ నేరాలు, సామాజిక అంశాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని, గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించి వాటి ఏర్పాటు కోసం ప్రజలను ప్రోత్సహించాలని చెప్పారు. నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాములు, సీఐలు సురేష్ బాబు, లక్ష్మీనారాయణ, డీసీఆర్బీ ఎస్సై ప్రదీప్, ఎస్సైలు కిరణ్ కుమార్, అనిల్, చిరంజీవి, నవీన్, గంగాధర్, రాజునాయక్, రవికిరణ్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించేందుకు సహకరించాలి

- **అన్ని రాజకీయ పార్టీల సహకారం అందించాలి**
- **సర్ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఆదర్శంగా నిలవాలి**
- **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి ఎస్ లత**

**జగిత్యాల: జూన్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, పకడ్బందీగా, పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత కోరారు. సర్ కార్యక్రమం అమలులో జగిత్యాల జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆమె అన్నారు. బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సందర్శన చేపట్టి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి నింపిన ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి సేకరిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో బీఎల్‌ఏలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించి అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు.జూలై 24న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ, సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాల పరిష్కారం చేపట్టి అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. బీఎల్‌వోలు ఇంటింటి సర్వే సందర్భంగా ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని, ఫారం అందని వారు లేదా పొరపాటున జాబితాలో చేరని అర్హులైన ఓటర్లను గుర్తించి నమోదు చేయించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్వైజర్లు, ప్రత్యేక అధికారులు నెల రోజులపాటు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని తెలిపారు. బి ఎల్ వో లు బి ఎల్ ఏ లకు పూర్తిస్థాయిలో సర్ కార్యక్రమం పై శిక్షణ కల్పించారని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే సర్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఎలాంటి అపోహలకు తావులేదని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించ బడకుండా, అనర్హులు జాబితాలో చేరకుండా చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ వాలంటీర్ల సహకారాన్ని కూడా వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పుల కోసం ఫారం-8, కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6 వినియోగించాలని సూచించారు. సర్ కార్యక్రమంపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జగిత్యాల, కోరుట్ల, మెట్ పెల్లి ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, మున్సిపల్ కమిషనర్ లు, రాజకీయ పార్టీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్‌ను తొలగించాలని రైతుల రాస్తారోకో



**నాగిరెడ్డిపేట మండలం జూన్ 24:( తెలంగాణ వాణి ప్రతినిధి)**

నాగిరెడ్డి పేట మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో బుధవారం రోజున యూరియా యాప్ నిలిపివేయాలని గ్రామ రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు . రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు పెద్ద ఎత్తున వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి . ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... జురియా యాప్ వల్ల తీవ్ర ఇబ్బంది ఎదురవుతున్నాయని అలాగే యూరియా అందక రైతులు ఇబ్బందిగా ఫాలో అవుతున్నారని వాపోయారు . గ్రామంలో అత్యధికంగా చిన్నకార రైతులు నిరక్షరాస్యులు ఉన్నారని తమకు ఎలాంటి స్మార్ట్ ఫోన్లు లేవని మా దగ్గర కేవలం కీప్యాడ్ ఫోన్లు మాత్రం ఉన్నాయని యూరియా యాప్ వాడడం ఎలాగో తెలియని పరిస్థితిలో ఉన్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు . తమకు యూరియా యొక్క కాకుండా పాత విధానాల్లోని యూరియా హత్య చేయాలని డిమాండ్ చేశారు . ఈ సందర్భంగా రాస్తారోకోలో సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు . ఈ సందర్భంగా వాహనదారులకు తీవ్రంగా ఇబ్బందులు ఏర్పడటం జరిగింది . సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై భార్గవ్ గౌడ్ స్పందించి తమ సిబ్బందితో రాస్తారోకో వద్దకు వచ్చి రైతులతో మాట్లాడి సంఘటన విషయాన్ని ఉన్నతాధికారులతో తెలియజేస్తామని ధర్నా విరమింప చేశారు . ఇట్టి కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ , ఉప సర్పంచ్ , రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు .




# కొమురవెల్లి అంతర్- జిల్లా దొంగల ముఠా గుట్టురట్టు

- **ముగ్గురు నిందితుల అరెస్టు**
- **బంగారం వెండి మరియు రెండు వాహనాలు,**
- **మొత్తం 7 లక్షల విలువగల సొత్తు స్వాధీనం**

**కొమురవెల్లి. జూన్.24( తెలంగాణ వాణి ప్రతినిధి)**

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసును పోలీసులు చేదించారు. ఫిర్యాదారుడు సార్ల సురేష్ (39) తన ఇంట్లో ఎవరూ లేనప్పుడు, ఇంట్లో ఉన్నటువంటి బంగారు, వెండి ఆభరణాలు దొంగతనం జరిగినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 30/05/2026 రోజున కొమురెల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగింది. ఈ క్రమంలో నిన్న అనగా తేదీ 23-06-2026 న కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేచరేణి గ్రామ శివారులో గల గుర్జకుంట కమాన్ వద్ద ఎస్.ఐ. టి. మహేష్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు.

విచారణలో నిందితులు ఎ-1. డొంగరి రాజు (31) ం/శీ లింగం , ఎ-2: పొట్ట ప్రవీణ్(29) ం/శీ రాజు, ఎ-3: బొద్దుల శ్రీనాథ్(28) ం/శీ ప్రభాకర్, మెదక్ జిల్లా కుల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో చేపల దుకాణంలో మహిళ మెడలో నుండి బంగారు పుస్తెల తాడు మరియు ఒక మొబైల్ ఫోన్‌ను అపహరించినట్లు, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మొబైల్ షాపులో నుండి హెచ్‌పీ ల్యాప్‌టాప్ మరియు సీసీ కెమెరా మానిటర్‌ను దొంగిలించినట్లు, అలాగే కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ చేసి బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు మరియు నగదును అపహరించినట్లు అంగీకరించారు.

దొంగిలించిన బంగారు ఆభరణాలలో కొంత భాగాన్ని హైదరాబాద్‌లో విక్రయించగా, కుల్చారం కేసుకు సంబంధించిన బంగారు పుస్తెల తాడును నిజామాబాద్‌లోని ఎఫ్ ఈ డి బ్యాంకులో కుదువ పెట్టినట్లు విచారణలో వెల్లడైంది.

స్వాధీనం చేసిన వస్తువులు:

- హెచ్.పి కంపెనీ ల్యాప్‌టాప్.

సి..సి టి.వి మానిటర్

- నేరాలకు ఉపయోగించిన, పల్సర్ ఎన్ ఎస్ 200 మోటార్ సైకిల్ నెం.టి.ఎస్ 16 ఈ డబ్య5296, యాక్టివా స్కూటీ నెం. టి జి08జి 8637

3 తులాల బంగారు గొలుసు.

7 గ్రాముల బంగారు ఆభరణాలు

8 తులాల వెండి పట్టగొలుసులు

1 తులం వెండి కుంకుమ్ భరణ

1 తులం వెండి ఉగ్గు గిన్నె

3 మొబైల్ ఫోన్లు

మొత్తం 7 లక్షల విలువగల సొత్తు స్వాధీనం . ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన బి. రమేష్, సి.ఐ., చేర్యాల్, కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. టి. మహేష్ తో పాటు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్ ఐ తిరుపతి రెడ్డి మరియు సిబ్బందినీ సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపిఎస్ అభినందించారు.

**ప్రజలకు విజ్ఞప్తి:**

ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద, కాలనీల్లో, వ్యాపార సముదాయాల వద్ద తప్పనిసరిగా సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. దొంగతనాల నివారణకు, నిందితులను త్వరగా పట్టుకోవడానికి సిసిటివి కెమెరాలు మూడవ కన్నులా పనిచేస్తాయి. మీ గ్రామంలో లేదా కాలనీల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగే వారిని గమనిస్తే వెంటనే అలర్ట్ అవ్వండి, వెంటనే డయల్ 100 కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయి తెలిపారు.



# పల్స్ పోలియోను విజయవంతం చేయాలన్న మెదక్ జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్

**మెదక్ జిల్లా 24 జూన్: (తెలంగాణ వాణి ప్రతినిధి)**

పల్స్ పోలియోను విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్ అధికారులకు ఆదేశించారు. బుధవారం మత శిశు సంరక్షణ దవాఖానలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారి జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ..మెదక్ జిల్లా లో ఈనెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని డిఎం అండ్ హెచ్ ఓ జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు.పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి అని కోరారు జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు మొత్తం 75,496 మందివీరికి 457 బూతులు ఏర్పాటు చేసి మొబైల్ టీంలు , ట్రాన్సిస్ట్ టీమ్స్, 872 ఏర్పాటు చేసి 1828 మంది ఏఎన్ఎమ్స్ ఆశాలు డాక్టర్లు విధులు నిర్వహించినట్లుగా చేయడం జరిగినది.125 హైరిస్ ఏరియాను గుర్తించి అందులో 657 చిల్డ్రన్ లను గుర్తించడం జరిగినదిఈ కార్యక్రమమును అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఒక్క పిల్లవాడు కూడా తప్పిపోకుండా 100% అందరూ పోలియో చుక్కలు వేయించుకోవాలని డి ఎం హెచ్ ఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారులు, ఏఎన్ఎంలు, సూపర్వైజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో సీనియర్ రీసెర్చ్ ఫెలో అవకాశం..

- **జూలై 10 వరకు దరఖాస్తులకు గడువు**
- **జూలై 14న ఇంటర్వ్యూల నిర్వహణ**
- **నెలకు రూ.42 వేల ఫెలోషిప్**

**పటాన్చెరు, జూన్ 24 (తెలంగాణ వాణి రిపోర్టర్)**

భారత ప్రభుత్వ అనుసంధాన్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) నిధులతో అమలు చేస్తున్న పరిశోధన ప్రాజెక్టు కింద హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ టు బీ యూనివర్సిటీ సీనియర్ రీసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్) పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు యూనివర్సిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఫార్మాస్యూటిక్స్ లేదా ఫార్మకాలజీలో ఎం.ఫార్మ్ డిగ్రీతో తొలి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి, మంచి అకడమిక్ రికార్డు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొంది. ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.42 వేల ఫెలోషిప్‌తో పాటు ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) కూడా అందజేయనున్నట్లు తెలిపింది. నియామకం ప్రారంభంలో ఏడాది కాలానికి ఉండగా, పనితీరు ఆధారంగా పొడిగించే అవకాశం ఉందని వెల్లడించింది.

ఆసక్తి గల అభ్యర్థులు తమ తాజా బయోడేటా, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తులను జూలై 10లోగా సమర్పించాలని, జూలై 14న ఇంటర్వ్యూలు నిర్వహించే అవకాశం ఉందని యూనివర్సిటీ పేర్కొంది. ఎంపికైన అభ్యర్థులకు మాత్రమే ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందజేస్తామని తెలిపింది.

దరఖాస్తులను ఎయ్ఘుజూఫ్ఏస్త్రఙ్ఘుఎ.వఒఐ కు పంపాలని, మరిన్ని వివరాలకు గీతం యూనివర్సిటీని సంప్రదించవచ్చని యాజమాన్యం సూచించింది.



# ప్రభుత్వ పాఠశాలకు లయన్స్ క్లబ్ చేయూత

**ధర్మారం:జూన్ 24 (తెలంగాణ వాణి )**

లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో ఖిలావనపర్తి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే సామగ్రిని బహుకరించారు. పాఠశాలను సందర్శించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు రూ.15 వేల విలువైన పోర్టబుల్ సౌండ్ సిస్టమ్‌తో పాటు విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి. రాంకిషన్, కార్యదర్శి ఎం. సత్యనారాయణ, కోశాధికారి కె. మహేందర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు మంచి విలువలు అలవరచుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.లయన్స్ క్లబ్ కార్యదర్శి ఎం. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రోత్సహించిన వారికి లయన్స్ క్లబ్ తరఫున సన్మానం చేసి బహుమతి అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా పాఠశాల తరఫున లయన్స్ క్లబ్ సభ్యులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోతే కనకయ్య, ఉపసర్పంచ్, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం చైర్మన్ సంతోష్, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్న, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, జయ, అర్చన, సుధీర్, సంతోష్ కుమార్, సిద్ధి రాములు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకం వద్దు -- పర్యావరణం మనకు ముఖ్యం

**నేత్ర స్కిన్ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ హర్షిణి పెనాల యాజమాన్యం,**




**జగిత్యాల: జూన్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రకృతిని కాపాడాలని నేత్ర స్కిన్ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్.హర్షిణి పెనాల కోరారు. జగిత్యాలలోని నేత్ర స్కిన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వైద్యులు, యాజమాన్యం, సిబ్బంది కలిసి బుధవారం ప్లాస్టిక్ వాడకం వద్దు -- పర్యావరణం మనకు ముఖ్యం అనే సందేశంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, గాలి కాలుష్యానికి ప్రధాన కారణమవుతున్నాయని వారు తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే సింగిల్ - యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని వైద్య నిపుణులు డా.హర్షిణి పెనాల సూచించారు. ప్లాస్టిక్ సంచుల స్థానంలో వస్త్ర లేదా జూట్ బ్యాగులను ఉపయోగించాలని డా.హర్షిణి పెనాల ప్రజలను కోరారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, చిన్న చిన్న మార్పుల ద్వారా పెద్ద ఫలితాలను సాధించవచ్చని హర్షిణి పెనాల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు సంపత్ కుమార్, సుబాన్, వంశీ, సిబ్బంది అలేఖ్య, ప్రణీత, మనోజ, నరేందర్ పాల్గొని ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

# డ్రగ్స్‌కు నో.. జీవితానికి ఎస్ :

**'డ్రగ్స్ వద్దు" అంటూ ప్రతిజ్ఞ చేయించిన ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి**




**పటాన్‌చెరు, జూన్ 24 (తెలంగాణ వాణి రిపోర్టర్)**

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని పటాన్ చెరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. పటాన్ చెరు పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక మంజీరా జూనియర్ కళాశాలలో బుధవారం "సే నో టు డ్రగ్స్.. సే యెస్ టు లైఫ్" అనే అంశంపై మెగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి మాట్లాడుతూ, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు, సామాజిక దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుంద ని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాల సాధన దిశగా పయనించాలని సూచించారు. డ్రగ్స్‌ను సేవించినా, విక్రయించినా ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. డ్రగ్స్ విక్రయించే వారి సమాచారం తెలిసిన వెంటనే డయల్-100 లేదా 1908కు తెలియ జేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.అనంతరం ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో "డ్రగ్స్‌కు దూరంగా ఉంటాం.. ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతాం" అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.డ్రగ్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి పిలుపునిచ్చారు.

# మెదక్ జిల్లాలోని విద్యా సౌకర్యాలను మెరుగుపరచాలన్న జిల్లా కలెక్టర్

**మెదక్ జిల్లా 24 జూన్: (తెలంగాణ వాణి ప్రతినిధి)**



బుధవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి జిల్లా విద్య అధికారి రాజు, మండల విద్య అధికారులు,స్పెషల్ ఆఫీసర్లు, విద్య అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా అవకాశాలు మెరుగు కోసం ప్రత్యేక అధికారులను నియమించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లా లో విద్య సౌకర్యాలు మరింత మెరుగు పరచడం కోసం ప్రత్యేక అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాల , కేజీబీవీ, మోడల్ స్కూల్, యు ఆర్ ఎస్ పాఠశాలల్లో, పెండింగ్ పనులు, మౌలిక వసతుల కోసం నిరంతరం పర్యవేక్షించి సమస్యలను పరిష్కరించి జిల్లాలో నాణ్యత గల విద్యను అందించడం కోసం పాటుపడాలన్నారు. ప్రత్యేక అధికారులు ఇచ్చిన నివేదికల ప్రకారం సమస్యలు ఉన్న ప్రభుత్వం విద్య సంస్థలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంచి మార్పుతో నవజీవనం సాగించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**నషా ముక్త్ భారత్ సప్తాహ్‌లో భాగంగా డవ్ పునరావాస కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్**



**ఆదిలాబాద్, జూన్ : 24 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
మంచి మార్పుతో నవజీవనం సాగించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం నషా ముక్త్ భారత్ సప్తాహ్‌లో భాగంగా డవ్ పునరావాస కేంద్రాన్ని సందర్శించి, వివిధ విభాగాలను, మెడికల్ క్యాంప్‌ను, 'టీబీ ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఎక్స్-రే క్యాంప్‌ను ఆయన స్వయంగా పరిశీలించారు. అంతకుముందు కేంద్రంలోని సిబ్బందిని, చికిత్స పొందుతున్న రోగులను వైద్య సేవలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "గతంతో పోలిస్తే ప్రస్తుతం ఈ కేంద్రం విశాలమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో బాగుందనీ, బాధితులు వాకింగ్ చేయడానికి, స్వేచ్ఛగా ఉండడానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఇక్కడికి వచ్చిన వారు 30 రోజుల్లోనే మంచి మార్పు సాధించడం సంతోషకరమని, మీ కుటుంబం, ముఖ్యంగా మీ పిల్లల చదువులు, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం మీరంతా వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలనీ సూచించారు. మీరు బాగుంటేనే మీ కుటుంబం, పిల్లలు బాగుంటుందని, ఇక్కడి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత మళ్లీ పాత అలవాట్ల జోలికి వెళ్లకుండా, లభించిన నవజీవనంతో సమాజంలో మంచి పనులు చేస్తూ బాధ్యతాయుతంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ డవ్ కేంద్రం ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.సాధన, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, వైద్యులు ఓం ప్రకాష్,సుమలత, విజయ్, కేంద్రం నిర్వాహకులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం

**గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరుపున బిఎల్ఏ లను నియమించాలి:**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**




**నిర్మల్, జూన్ 24(తెలంగాణ వాణి ప్రతినిధి)**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ వివరాలను సమగ్రంగా వివరించారు. ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ఫారంలు ఎన్నికల సంఘం వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో కూడా సమర్పించవచ్చునన్నారు. వివరాల పరిశీలన తర్వాత, ఎస్ఐఆర్ కి సంబంధించి, జూలై 31 వ తేదీన డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ లో ఓటరు పేరు లేకపోతే తగిన ఆధారాలతో సంబంధిత ఫామ్ లను నింపి, ధ్రువీకరణ (డిక్లరేషన్) తో ఈఆర్ఓ లను సంప్రదించవచ్చునని చెప్పారు. ఫాం 6, 7, 8 ల గురించి వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి ప్రతి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తరుపున బూత్ లెవెల్ ఏజెంట్ (బిఎల్ఏ) లను నియమించాలని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా తమ ఓటు హక్కు కోల్పోకుండా, పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేస్తామని అన్నారు. ఎప్పటికప్పుడు బిఎల్ఓ లు, బిఎల్ఏ ల తో సమావేశం నిర్వహించాలని తెలిపారు. ఎస్ఐఆర్ నిర్వహణలో బిఎల్ఏ లు తమ వంతు సహకారం అందించాలని చెప్పారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓలు దేవీదాస్, మోహన్ సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసిల్దార్ లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏద మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**ఎల్లారెడ్డి, జూన్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి పట్టణంలోని ఏద వర్షిప్ సెంటర్, ఏద గ్రౌండ్స్‌లో ఏద మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో యూనికార్పస్ హెల్త్ ఫౌండేషన్ మరియు ఇండియా మెడికల్ మిషన్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. ఏద మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బ్రదర్ శ్రీనివాసాచారి, సిస్టర్ హెప్సిబా చారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, ఇన్‌చార్జి ఆర్డీఓ రవీందర్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ వైద్య శిబిరంలో ఎల్లారెడ్డి పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి 400 నుంచి 500 మంది వరకు ప్రజలు పాల్గొని తమ ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్యుల సలహాలు, చికిత్సలు పొందారు. యూనికార్పస్ హెల్త్ ఫౌండేషన్‌కు చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ శాంసన్ సుజిత్ కుమార్, డెంటిస్ట్ డాక్టర్ శిల్పాతో పాటు ఇండియా మెడికల్ మిషన్‌కు చెందిన డాక్టర్ అభిషేక్, డాక్టర్ వర్షిణి, డాక్టర్ నవ్య, డాక్టర్ దేవి ప్రియాంక, డాక్టర్ గౌతమ్, డాక్టర్ కుమార్‌వెల్, డాక్టర్ రాజేష్ ఖన్నా తదితర వైద్యులు సేవలందించారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, ఉచిత మందులు, ఉచిత కంటి అద్దాలు అందజేశారు. అనంతరం ఏద మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పాల్గొన్న వారికి పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేసి సేవలందించారు. వైద్య శిబిరం ద్వారా గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.

# మంకీ రెస్క్యూ సెంటర్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

**నిర్మల్, జూన్ 24(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామ గ్రామంలోని గండిరామన్న హరితవనంలో గల మంకీ రెస్క్యూ సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోతుల పట్టివేతకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పట్టుకున్న కోతులు, పునరావాసం, అందుబాటులో ఉన్న మంకీ క్యాచర్స్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఇతర అధికారులు, స్బింది, తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి సంక్షేమ పథకం పేదలందరికీ చేరాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష

**"ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" సమీక్ష ప్రత్యేక అధికారి ఇలంబర్తి.**

**నిర్మల్, జూన్ (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రతి సంక్షేమ పథకం క్షేత్రస్థాయిలో పేదలందరికీ చేరాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఆకాంక్ష అని "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" సమీక్ష ప్రత్యేక అధికారి ఇలంబర్తి అన్నారు. "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" సమీక్ష ప్రత్యేక అధికారి ఇలంబర్తి, బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిం ంలో 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా 99 రోజుల ప్రణాళికలో శాఖల వారిగా చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి ఫోటో గ్యాలరీని కలెక్టర్, అధికారులతో కలిసి తిలకిం చారు. శాఖల వారిగా చేపట్టిన కార్యక్రమాల వివరాలు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరి ంచారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, అన్ని శాఖలు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాలు అన్ని శాఖల అధికారులు విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ శాఖల వారీగా సంబంధిత పథకాలు, సంక్షేమ ఫలాలు అన్ని అట్టడుగు వర్గాల ప్రజలకు చేరే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. స్పష్టమైన ప్రణాళికతో ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం



చేసినందుకు అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు వెల్లడించిన నివేదికలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసు శాఖ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల వల్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ఇన్నోవేటివ్ ఆలోచనలతో అధికారులు ముందుకు సాగాలన్నారు.

**ప్రజల సమిష్టి భాగస్వామ్యం, అధికారుల కృషితోనే "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" విజయవంతం.**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**
ప్రజలు, ప్రజా ప్రతినిధుల సమిష్టి భాగస్వామ్యం, అధికారుల కృషితోనే "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు, గ్రామ, వార్డు సభలు, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్, అరైవ్ అలైవ్ కార్యక్రమం, రైతు, మహిళా శిశు సంక్షేమ, విద్యా ఆరోగ్య, సంస్కృతిక, పర్యావరణ వారోత్సవాల పేరిట విస్తృత కార్యక్రమాలు చేపట్టామన్నారు. గ్రామ, వార్డు సభలు నిర్వహించి అధికారులంతా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించినట్లు వివరించారు. దీర్ఘ కాలికంగా పెండింగ్లో ఉన్న అంశాలను పరిష్కరించినట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంటల దిగుబడి అధికంగా వచ్చిందని, అధికారుల సమన్వయంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని పంటలను కొనుగోలు చేశామన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం నిల్వ ఉంచేందుకు అవసరమైన గోదాములను నిర్మిస్తామని చెప్పారు. రెవెన్యూ కు సంబంధించిన అంశాలన్నీ తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే,భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: జిల్లా కలెక్టర్

**మంచిర్యాల,జూన్ 24 (తెలంగాణ వాణి):**
జిల్లాలో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం నెన్నెల మండలం పుప్పల్వానిపేట గ్రామంలో నిర్వహించిన భూ సర్వే అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం భూ సర్వే నిర్వహించి సంబంధిత చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.భూ సర్వే ప్రక్రియను సమగ్రంగా నిర్వహించడం వల్ల భవిష్యత్తులో భూమి వివాదాలను తగ్గించవచ్చని చెప్పారు. పట్టాదారులు తమ భూముల హద్దులను స్పష్టంగా నిర్ధారించుకుని అవసరమైన పత్రాలతో సర్వేలో పాల్గొనాలని సూచించారు.అర్హులైన వారికి మాత్రమే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని, తప్పుడు దరఖాస్తులను రద్దు చేస్తామని తెలిపారు. వివాదాస్పద భూములను చట్టబద్ధంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ అధికారులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. విధుల్లో సమయపాలన పాటించాలని సూచించారు. భూభారతి



పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. తదుపరి కొన్నంపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపొందించేలా కృషి చేయాలని తెలిపారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వీధి వ్యాపారుల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- **వ్యాపారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం : కలెక్టర్ చిత్రా మిశ్రా**
- **పీఎం స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్:జూన్ 24 (తెలంగాణ వాణి ప్రతినిది)**
వీధి వ్యాపారుల ఆర్థికాభివృ ద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నా మని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్విని యోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని వీధి వ్యాపారులకు పిలుపునిచ్చారు. కరీంనగర్ కళాభారతిలో బుధవారం నిర్వహించిన స్వనిధి మహోత్సవం కార్యక్ర మానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా,నగర మేయర్ కొలగాని శ్రీనివాస్,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,మెప్మా పీడీ స్వరూప రాణి,కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు,వీధి వ్యాపారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్‌లో స్ట్రీట్ వెండర్ కల్చర్‌ను మరింత అభివృద్ధి చేయాల్సి న అవసరం ఉందన్నారు.వీధి వ్యాపారుల సమస్యలు,అవ సరాలు,అభివృద్ధి అవకా శాలపై చర్చించేందుకు త్వర లో ప్రత్యేక సమావేశం నిర్వ హించాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించారు. వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి జిల్లా యంత్రాంగం,మున్సిపల్ యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.రుణాలను సద్విని యోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. నగర మేయర్



కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ పీఎం స్వనిధి పథకం ద్వారా లభిస్తు న్న అవకాశాలను వీధి వ్యాపా రులు సద్వినియోగం చేసుకు ని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు.కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని,మహిళా వ్యాపారులు మరింతగా అభివృద్ధి చెందేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పీఎం స్వనిధి పథకం అమలులో ముందంజలో ఉందని పేర్కొన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలు వినియో గించుకోవాలని సూచించారు. వ్యాపారులకు క్రెడిట్ సదుపా యాలు,ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.పీఎం స్వనిధి పథకం కింద మంజూ రైన రూ.50 లక్షల విలువైన చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.అనంతరం పలువురు వీధి వ్యాపారు లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు,అధికారులు, మహిళా సంఘాల ప్రతిని ధులు,వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

# రోడ్లపై వరద నీరు నిల్వ కాకుండా ముందస్తు చర్యలు

**డ్రైనేజీ వ్యవస్థ నాళాలను పరిశీలించిన కలెక్టర్, సిపి, నగరపాలక సంస్థ కమిషనర్**

**కరీంనగర్:జూన్ 24 (తెలంగాణ వాణి ప్రతినిది)**
వర్షాకాలం నేపథ్యంలో నగరంలో రోడ్లపై వరద నీరు నిల్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కరీంనగర్ నగరంలోని రాంనగర్,రేకుర్తి,మంచిర్యాల చౌరస్తా,కలెక్టరేట్ సమీపంలో ని ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ నాలాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా,పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం,నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వరద నీరు రోడ్లపైకి రాకుండా చేపట్టాల్సిన చర్యలపై అధికా రులతో సమీక్ష నిర్వహించా రు.ప్రజలు,వాహనదారులు, ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాల ని జిల్లా కలెక్టర్ సూచించారు. డ్రైనేజీలు,నాలాల్లో వర్షపు నీరు నిరంతరాయంగా ప్రవహించేలా తక్షణ చర్యలు చేపట్టాలని,ఎక్కడా మురుగు లేదా వర్షపు నీరు నిల్వ కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారు లను ఆదేశించారు.రాబోయే రోజుల్లో




భారీ వర్షాలు కురిసే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నగరంలోని కీలక జంక్షన్ల వద్ద నీరు నిల్వ కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాల్సి న అవసరంపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్,నగరపాల క సంస్థ కమిషనర్ చర్చిం చారు.

# ప్రత్యేక అధికారి ఇలంబర్తికి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, జూన్ 24(తెలంగాణ వాణి ప్రతినిధి)**
"ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" సమీక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన ప్రత్యేక అధికారి ఇలంబర్తికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం అటవీ శాఖ వసతి గృహంలో పూల మొక్కను అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా డీఎఫ్‌వో సుశాంత్ సుఖదేవ్ బోబడే, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.





# మహిళల రక్షణే షీ టీం ధ్యేయం

**మందమర్రి జూన్ 24 (తెలంగాణ వాణి విలేకరి)**
మహిళల రక్షణే షీ టీం ధ్యేయమని,వేధింపుల రహిత సమాజమే లక్ష్య మని మంచిర్యాల జిల్లా షి టీమ్ ఎస్.ఐ. ఉషారాణి పేర్కొన్నారు.జిల్లా షి టీమ్ ఎస్.ఐ.ఉషారాణి ఆధ్వ ర్యంలో తెలంగాణ లోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మందమర్రి మండ ల సమాఖ్య ఉద్యోగులకి మహిళా శక్తి భవనం లో బుధవారం మహిళల భద్రతకు సంబంధించి షీ టీమ్ సిబ్బంది షీ టీమ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్ర మంలో షి టీమ్ సిబ్బంది మాట్లాడుతూ, మహిళల కు అమలు చేస్తున్న భద్రత సంబందిత చర్య లు, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, టి సేఫ్ యాప్, షీ టీమ్ లపై సమగ్ర అవగా హన కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నామని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురి చేసినట్లయితే ఎప్పుడూ అందుబాటులో ఉండే రామగుండం షీ టీమ్ నంబర్ 6303923700, మంచిర్యాల షి టీమ్ నంబర్ 8712659385 లేదా డయల్ 100 నంబర్ కి ఫోన్ చేయాలని సూచిం చారు. సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 అని ఈ నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకో వాలనిసూచించారు.అలాగే సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఉద్యోగులకు వివరిం చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షి టీమ్ సిబ్బంది కానిస్టేబుళ్లు సతీష్,జ్యోతి మందమర్రి ఏపిఎమ్ చంద్రశేఖర్ అన్ని గ్రామ సంఘాల సెర్ఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# తినుబండారాల దుకాణదారులంతా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి

**పట్టణంలోని మిఠాయి దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారి టి. సునీత.**

**గడువు ముగిసిన, లేబుళ్లు లేని ఆహార పదార్థాల గుర్తింపు.**

**నిర్మల్, జూన్ 24(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత పట్టణంలోని మిఠాయి దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ దాడులలో పలు దుకాణాలలో గడువు తీరిన మిఠాయిలు, చాక్లెట్లు, లేబుళ్లు లేని ఆహార పదార్థాలను గుర్తించారు. ఆయా మిఠాయి దుకాణాలపై తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. దుకాణదా రులంతా ఆహార పదార్థాలకు సంబంధించి లేబుళ్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆహార పదార్థాల గడువు ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ, గడువు తీరిన ఆహార పదార్థాలను దుకాణాల నుంచి తొలగించాలని తెలిపారు.



# పేదల సొంతింటి కల సాకారం..

**కన్నుల పండుగగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాలు**

**నిర్మల్ - కుబీర్: జూన్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిర్మించిన గృహాల ప్రారంభోత్సవాలు బుధవారం కుబీర్ మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గోనేలు లక్ష్మి--రాహుల్ కుటుంబానికి మంజూరైన ఇందిరమ్మ ఇంటిని ముధోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి.విట్టల్ రెడ్డి ప్రారంభించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాలు జరగడం సంతోషకరమన్నారు.పేదల సొంతింటి కలను నిజం చేస్తూ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పాలనలో మరో ముందడుగు వేసిందన్నారు. గృహహీన కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం సామాన్య ప్రజలకు ఎంతో మేలు చేస్తోందని పేర్కొన్నారు. ముధోల్ నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు,గృహ నిర్మాణ మరియు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు ప్రజల తరఫున మాజీ ఎమ్మెల్యే జి.విట్టల్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కందురు సాయినాథ్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పాటిల్,మండల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.



## మద్యపానం,మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని బాధితులకు సూచించిన కలెక్టర్,సీపీ**



**కరీంనగర్:జూన్ 24 (తెలంగాణ వాణి)**

మద్యపా నం,మాదకద్రవ్యాల వినియో గాన్ని పూర్తిగా మానుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా,పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సూచించారు. కరీంనగర్ నగరంలోని అశోక్ నగర్‌లో ఉన్న మాదకద్ర వ్యాల,మద్యపాన వ్యసన విముక్తి కేంద్రాన్ని బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా,పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం,నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు.ఈ సందర్భంగా కేంద్రం నిర్వ హణ,బాధితులకు అంది స్తున్న వైద్య సేవలు,పునరా వాస కార్యక్రమాలపై ఆరా తీశారు.కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు,చికిత్స పురోగతిని తెలుసుకున్నారు.వైద్యుల సూచనల మేరకు చికిత్సను పూర్తిగా కొనసా గించి మద్యపానం,మాదక ద్రవ్యాల వినియోగాన్ని శాశ్వతంగా మానుకోవాలని సూచించారు.మద్యం,మాదక ద్రవ్యాల వ్యసనాల వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టాయని పేర్కొన్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటేనే మంచి ఆరోగ్యం, ఉజ్వల భవిష్యత్తు సాధ్యమ వుతుందని,కుటుంబ సభ్యుల ఆశలను నెరవేర్చే దిశగా ముందుకు సాగాలని బాధితులకు ప్రోత్సాహం అందించారు.ఈ కార్యక్రమం లో జిల్లా మహిళా సంక్షేమ అధికారి సరస్వతి,నాగేశ్వర రావు,కేంద్ర నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నియోజక వర్గ బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం



**హుజురాబాద్ జూన్ 24 (తెలంగాణ వాణి)**

బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఘనంగా జరిగింది.ఈ సమావేశానికి గిన్నారపు మహేందర్ అధ్యక్షత వహించారు.సమావేశం ప్రారంభంలో మహాత్మా జ్యోతిరావు పూలే,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,మాన్యశ్రీ కాన్షీరాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్లె ప్రశాంత్ గౌడ్ జోన్ ఇన్చార్జి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల దృష్ట్యా బూత్ స్థాయి కమిటీలను బలోపేతం చేయాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.బీఎస్పీ సిద్ధాంతాల ను,బహుజన రాజ్య స్థాపన లక్ష్యాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలని పిలుపుని చ్చారు.ఈ కార్యక్రమంలో నియోజ కవర్గ ఇంచార్జ్ డా.అంబాల ప్రభాకర్ సీనియర్ నాయ కులు దొడ్డే సమ్మయ్య, మారపెల్లి మోగిలయ్య,గరిగే చంద్రయ్య,ఈదునూరి రమేష్,రాచపెల్లి రమేష్, ఇల్లందుల రమేష్,రాజు అగ్నితేజ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 28న అన్నవరం కు నలిమెల బుచ్చమ్మ -రామ చంద్రం స్మారక పురస్కారం

**నలిమెల భాస్కర్ పరిశోధనా పుస్తకాల ఆవిష్కరణ సమావేశం**

**కరీంనగర్ జూన్ 24 (తెలంగాణ వాణి)**



ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ కు నలిమెల బుచ్చమ్మ - రామ చంద్రం స్మారక పురస్కార ప్రదాన సభ ఈనెల 28 ఆదివారం ఉదయం 10 గంట లకు కరీంనగర్ ఫిలిం భవన్ లో ఉంటుందని సాహితీ సోపతి ప్రతినిధి సివి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బహుభాషా వేత్త,కేంద్ర సాహి త్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ కీర్తిశేషులైన తన తల్లిదండ్రులు నలిమెల బుచ్చమ్మ - రామచంద్రంల పేర సామాజిక సాహిత్య రంగాల్లో విశేష కృషి చేసిన వారిని ఎంపిక చేసి ప్రతి ఏటా 15 వేల రూపాయల పురస్కా రాన్ని అందచేస్తానని ప్రకటిం చారు.తొలిసారిగా దానిని కరీంనగర్ కు చెందిన కవి రచయిత అన్నవరం దేవేందర్ ను గుర్తించి ఎంపిక చేసి గౌర విస్తున్నారు.అలాగే డాక్టర్ నలిమెల భాస్కర్ 1985 లో పూర్తిచేసిన ఎంఫిల్ గ్రంథం 'తెలుగులో సామెతలు- ద్రావిడ భాషల్లో తులనాత్మక పరిశీలన,1990 లో పూర్తిచేసి న పిహెడీ గ్రంథం 'తెలుగు మలయాళ సామెతలు కుటుంబ జీవన చిత్రణ'రెండు పుస్తకాలను ఇట్టి సమావేశ మునకు ముఖ్యఅతిథిగా హాజరవుతున్న తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్స్ లర్,కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య ఎన్ గోపి ఆవిష్కరి స్తారని సివి కుమార్ తెలిపా రు.ఈ సమావేశం కు ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు కవి రచయిత నగునూరి శేఖర్ అధ్యక్షత వహిస్తారని, విశిష్ట అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య ఎన్ రఘు హాజరవుతున్నారని తెలిపారు.ఆత్మీయ అతిథులుగా బీసీ రచయితల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, కవి కథా రచయిత గాజోజు నాగభూషణం, కరీంనగర్ ఎస్ ఆర్ ఆర్ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ కవి రచయిత బూర్ల వెంకటే శ్వర్లు హాజరై ప్రసంగిస్తారని కుమార్ తెలిపారు.ఇట్టి సాహిత్య సమావేశమునకు కవులు రచయితలు పరిశోధ కులు ఉపాధ్యాయులు హాజరుకావాలని సివి.కుమార్ ఆ ప్రకటనలో కోరారు.

## నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్ పిల్లి మల్లేష్

**దొరికిన రూ.15 వేల నగదును యజమానికి అప్పగించిన ఆటో డ్రైవర్**

**ఇల్లందు, జూన్ 24 (తెలంగాణ వాణి)**



ఇల్లందు పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ఏరియా కమిటీ సభ్యుడు పిల్లి మల్లేష్ తన నిజాయితీని చాటుకున్నారు. బుధవారం ఇల్లందు పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్‌లో ఆటోకు డీజిల్ పోయించుకుని బయటకు వస్తున్న సమయంలో రూ.15 వేల నగదు, ఏటీఎం కార్డు కింద పడివున్నట్లు గుర్తించారు. వెంటనే ఆయన ఆ డబ్బును తీసుకుని టీయూసీఐ జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షాకు సమాచారం అందించారు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి సంబంధిత పెట్రోల్ బంక్‌కు వెళ్లగా, అక్కడ బంక్ మేనేజర్ ముత్యాల నరేష్ తన డబ్బు పోయిందని ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. సీసీ కెమెరాల ఆధారంగా పరిశీలించగా, ఆ నగదు మరియు ఏటీఎం కార్డు బంక్ మేనేజర్‌వేనని నిర్ధారణ అయింది. దీంతో పిల్లి మల్లేష్ దొరికిన రూ.15 వేల నగదును మేనేజర్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా మేనేజర్ ముత్యాల నరేష్ మాట్లాడుతూ, నెలంతా విధులు నిర్వహించి అదే రోజు డబ్బులు డ్రా చేసుకుని వచ్చానని, నగదు పోయిన తర్వాత తీవ్ర ఆందోళనకు గురయ్యానని తెలిపారు. నిజాయితీగా వ్యవహరించి తన డబ్బును తిరిగి అందజేసిన ఆటో డ్రైవర్ పిల్లి మల్లేష్‌ను బంక్ మేనేజర్‌తో పాటు పలువురు అభినందించారు.

# మానసిక వికలాంగులకు విద్యనందించడం గొప్ప అదృష్టం

- పాఠశాల నిర్వహణ తీరు ఆదర్శం
- మానసిక వికలాంగుల పాఠశాల సందర్శించిన రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా

**కరీంనగర్/తిమ్మాపూర్ జూన్ 24 (తెలంగాణ వాణి)**





మానసిక వికలాంగులక విద్యనందించడం గొప్ప అదృష్టమని,వారికి విద్యతో పాటు నైపుణ్యాలను అందిం చి స్వావలంబన దిశగా తీర్చిదిద్దడం ప్రశంసనీయ మని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి,జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు.బుధవారం తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలో జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న మానసిక వికలాంగుల పాఠశాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ఆయన సందర్శించారు.ఈ సందర్భం గా పాఠశాల ఆవరణలో సందీప్ కుమార్ సుల్తానియా, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఇతర అధికారులు మొక్కలు నాటారు.అనంతరం పాఠశా లలోని తరగతి గదులు, హాస్టల్,డైనింగ్ హాల్,వృత్తి విద్యా శిక్షణ కేంద్రాలు,ఇతర సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.మాన సిక వికలాంగుల కోసం నిర్వహిస్తున్న వృత్తి విద్యా శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన సందీప్ కుమార్ సుల్తానియా, విద్యార్థులు ప్రదర్శిస్తున్న ప్రతిభను అభినందించారు. విద్యార్థులలోని నైపుణ్యాల ను వెలికితీసి వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా శిక్షణ ఇవ్వడం అభినందనీయ మని పేర్కొన్నారు.పాఠశాల నిర్వ హణ తీరు,విద్యార్థుల సంర క్షణ,పరిశుభ్రత,క్రమశిక్షణ, అందిస్తున్న సౌకర్యాలు ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు. మానసిక వికలాంగుల అభి వృద్ధి కోసం ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు,సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నా రని కొనియాడారు.ఈ సంద ర్భంగా జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ అధ్య క్షుడు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పాఠశాల కార్య కలాపాలు,విద్యార్థులకు అందిస్తున్న సేవలు,ఎదుర వుతున్న అవసరాలను సందీప్ కుమార్ సుల్తానియా, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు వివరించారు.పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం తరపు న అవసరమైన సహకారం అందించాలని కోరారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ సభ్యులతో సమావేశమైన సందీప్ కుమార్ సుల్తానియా, పాఠశాల నిర్వహణపై సంతృ ప్తి వ్యక్తం చేశారు.మానసిక వికలాంగుల విద్య,సంక్షేమం కోసం చేస్తున్న సేవలు సమా జానికి ఆదర్శమని పేర్కొన్నా రు.విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా,అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే,శ్రీనివాస్ రెడ్డి,నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, ట్రైనీ కలెక్టర్ హరిప్రసాద్, ఆర్డీవో షర్మిల,జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి,తహసీల్దా ర్ శ్రీనివాస్ రెడ్డి,స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ సభ్యు లు,పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన కలెక్టరేట్లో పలు నిర్మాణాలకు శంకుస్థాపన

**హాజరైన ఎమ్మెల్యే, మేయర్, సుడా చైర్మన్**

**కరీంనగర్:జూన్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**





శాతవాహన అర్బన్ డెవల ప్మెంట్ కరీంనగర్ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయా ల సముదాయం వద్ద హెలి ప్యాడ్ నిర్మాణం,సర్వీస్ రోడ్డు, హెలిప్యాడ్ కు ప్రవేశ ద్వారం ఏర్పాటు చేసేందుకు బుధవా రం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.53 లక్షల రూపాయల సుడా నిధులతో చేపట్టనున్న ఈ నిర్మాణాలకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్,కూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కొత్త కలెక్టరేట్ నుండి ఈశాన్యం గేట్ వరకు రహదారి అభివృద్ధి పనులు గార్డెన్ సుందరీకరణ పనుల కు శంకుస్థాపన చేశారు. ఈ రెండు పనులను కోటి ఇరవై లక్షలతో చేపట్టను న్నారు.ఈ సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ నిర్ణీత కాలవ్య వధిలోగా నాణ్యతా ప్రమాణా లతో పనులు పూర్తి చేయా లని అధికారులను ఆదేశిం చారు.కరీంనగర్ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. కరీంనగర్ జిల్లా వాసులకు ఇలాంటి మౌలిక వసతుల కల్పన ఎంతో దోహదపడు తుందని పేర్కొన్నారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా,పారదర్శ కంగా,నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారు లను ఆదేశించారు.అభివృద్ధి పనులకు ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు.జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ ఆర్ అండ్ బి ఈ నరసింహా చారి పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిఈఓకు సమగ్ర నివేదిక

- ప్రైవేటు పాఠశాలల దోపిడీపై సమగ్ర నివేదిక తయారుచేసి డీఈవోకు అందించిన బిఆర్ఎస్వి
- సేవ దృక్పథం మరచి విద్యార్థులను దోచుకుంటున్న విద్యాసంస్థలపై రెండు రోజు ల్లోగా చర్యలు తీసుకోవాలి
- విద్యాశాఖ చర్యలు తీసుకోకుంటే,ప్రైవేటు పాఠశాలలు అక్రమంగా అమ్ముతున్న పుస్తక గోదాములను ముట్టడిస్తాం

**కరీంనగర్ టౌన్:జూన్ 24 (తెలంగాణ వాణి)**





కరీంనగర్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాల లు విద్యను సేవా దృక్పతంతో చూడకుండా ఒక వ్యాపారం గా మార్చి నిరుపేద విద్యార్థు ల రక్తం తాగుతున్నారని కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్ మండిపడ్డారు.గత రెండు రోజుల క్రితం డి ఈ ఓ ను కలిసి ప్రైవేటు పాఠశాలలో దోపిడికి సంబంధించిన సమగ్ర నివేదికను తయారుచేసి ఇస్తామని చెప్పిన మాట ప్రకారం నేడు పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్వి నేతలు డి ఈ ఓను కలసి ప్రైవేట్ ప్రైవేటు పాఠశాలలు అక్రమంగా నిర్వహిస్తున్న పుస్తకాలను అమ్ముతున్న గోదాముల వివరాలు,పుస్తక నిల్వలకు సంబంధించిన సమగ్ర నివేదిక తయారు చేసి వారికి అందిం చారు.ఈ సందర్భంగా అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ

విద్య వ్యవస్థల్లో నెలకొన్న సమస్యలు వాటిపై మీ స్పందన అనే కార్యక్రమం ద్వారా మొదటగా జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీ ఏ విధంగా ఉంది అనే విషయా న్నివివరించామని.అంతేకాకుండా జిల్లా కేంద్రంలో అక్రమంగా పుస్తకాలను అమ్ముతున్న విద్యాసంస్థల వివరాలను రెండు రోజుల్లో డిఈవో కు అం దిస్తామని చెప్పిన విధంగా.సమగ్ర నివేదికను తయారు చేసి వారికి అందించమన్నారు రెండు రోజుల్లో విద్యాశాఖ నుండి ఇలాంటి చర్యలు చేపట్టకపోతే బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాల పుస్తక గోదా ములను ముట్టడిస్తామని హెచ్చరించారు.నాడు బిఆర్ ఎస్ పార్టీ ప్రభుత్వ హయాం లో ప్రభుత్వ పాఠశాలలతో పాటు గురుకులాల్లో అన్ని వసతులు ఉండి విద్యార్థులు చక్కగా విద్యను అభ్యసించే వారిని కానీ ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పాఠశాలలో కనీస వసతులు లేక ఇటు గురుకులాలు నిర్వీర్యం అయిపోయి.ప్రజలు ప్రైవేటు పాఠశాలలపై మొగ్గుచూపే పరిస్థితి నెలకొందని దీన్ని ఆసరాగా చేసుకొని ప్రైవేట్ పాఠశాలు దోపిడీకి పాల్ప డుతున్నాయని వీటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కొంతమంది అధికారులు పాఠశాల యజమాన్యాలతో మాట్లాడుకొని పుస్తకాలను అక్రమంగా అమ్ముకునేందుకు ప్రత్యక్షంగా మద్దతు తెలుపుతున్నారని సమాచారం మాకు ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను చదివించాలంటే వారి ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి ఈ ప్రభుత్వంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.రెండు రోజుల్లో డి ఈ ఓ తగిన ఆదేశాలు. అధికారులకు ఆదేశాలు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రైవేట్ పాఠశాలల గోదాములను మీడియా ప్రతినిధుల ను పోలీస్ లకు సమాచారం ఇచ్చి మరీ ముట్టడిస్తామని శాంతియుతంగానే చర్యలు ఉంటాయన్నారు.ఒకవైపు సోషల్ మీడియా లో కూడ ఎప్పటికప్పుడు నిజాలు బయటపెడుతామన్నారు.ఈ కార్యక్రమంలో పొన్నం అనిల్ కుమార్ గౌడ్ తో పాటు జిల్లా బిఆర్ఎస్వి కోఆర్డినేటర్ ద్యావ మధుసూదన్ రెడ్డి , శాతవాహన యూనివర్సిటీ ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్ , నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు గంగాధర చందు,పటేల్ శ్రవణ్ రెడ్డి, సోమిరెడ్డి రాజా నరేష్ రెడ్డి వడ్లకొండ పరుశరామ్, విక్రమ్, అన్వేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు .

# రైతు కంటే ప్రచారకర్తకే పెద్ద పీట

**భద్రాద్రి బ్యూరో, జూన్ 24 (తెలంగాణ వాణి)**





ఆరుకాలం కష్టపడి పంట సాగు చేసే రైతు కంటే, కొద్ది నిమిషాల వీడియోలు చేసే ప్రచారకర్తలకే సీడ్ కంపెనీలు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుల సమస్యలు, కాపు పరిస్థితులు, నష్టాలపై దృష్టి పెట్టాల్సిన కంపెనీలు ప్రచారానికి మాత్రం భారీ మొత్తాలు వెచ్చిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.విత్తనాలను కొనుగోలు చేసి నష్టపోయిన రైతులకు సరైన భరోసా ఇవ్వడంలో విఫలమవుతున్న కంపెనీలు, తమ ఉత్పత్తులను సోషల్ మీడియాలో ప్రమోట్ చేసే వ్యక్తులకు మాత్రం లక్షల్లో చెల్లింపులు చేస్తున్నాయనే చర్చ సాగుతోంది. దీంతో కంపెనీలకు రైతుల కంటే ప్రచారకర్తలకే ఎక్కువ ప్రాధాన్యత ఉందనే అభిప్రాయం రైతు వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఒక కేజీ విత్తనం అసలు ధర కంటే ప్రచార ఖర్చే అధికంగా ఉండటం ఇప్పుడు అనేక ప్రశ్నలకు తావిస్తోంది. విత్తనాల నాణ్యత, క్షేత్రస్థాయి ఫలితాలు, దిగుబడిపై విశ్వాసం ఉంటే ఇంత భారీగా ప్రచారంపై ఖర్చు చేయాల్సిన అవసరం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. "విత్తనంలో విషయం లేనప్పుడు ప్రచారం పీక్స్‌లో ఉంటుంది" అనే సామెతలా, కొందరు కంపెనీలు నాణ్యత కంటే ప్రచారానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంట పొలాల్లో ఫలితాల కంటే సోషల్ మీడియా వీడియోల ద్వారానే మార్కెట్‌ను సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతిమంగా, కష్టపడేది రైతు.. పెట్టుబడి పెట్టేది రైతు.. నష్టపోయేది రైతే అయినా, లాభాలు మాత్రం మధ్యవర్తులు, ప్రచారకర్తలు, మార్కెటింగ్ వ్యవస్థకే చేరుతున్నాయనే ఆవేదన రైతు వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# మొహర్రం పండుగకు ఏర్పాట్లు చేయాలి

**అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**





కరీంనగర్:జూన్ 24 (తెలంగాణ వాణి)మొహర్రం పండుగను ప్రశాంత వాతావ రణంలో నిర్వహించుకు నేందుకు అధికారులు సమ న్వయంతో ఏర్పాట్లు చేయా లని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మొహర్రం పండుగ ఏర్పాట్లు, నిర్వహణపై వివిధ శాఖల అధికారులు,ముస్లిం మత పెద్దలతో సమన్వయ సమా వేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మొహర్రం పర్వదిన ఏర్పాట్లు,నిర్వహ ణపై అధికారులు ,ముస్లిం మత పెద్దలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదన పు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మొహర్రం సందర్భంగా ఊరేగింపు మార్గాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం,ప్రత్యేక మరమ్మతులు,విద్యుత్ దీపాలు,నిరంతర విద్యుత్తు సరఫరా,వైద్య శిబిరాలు, అగ్నిమాపక భద్రత చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను చేయాలన్నారు. మున్సిపల్, విద్యుత్,ఇతర సంబంధిత శాఖల అధికారు లు సమన్వయంతో పండుగ కు పకడ్బందీ ఏర్పాటు చేయా లని ఆదేశించారు.సమావే శంలో మతపెద్దలు సూచిం చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఊరేగింపు కోసం ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డి సి పి వెంకటరమణ,ఆర్డీవో లు షర్మిల,జల కుమారి వివిధ శాఖల ఉన్నతాధికారులు, మొహరం పండుగ నిర్వహణ కమిటీ నాయకులు,ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



# విజయ్-త్రిషపై మళ్లీ ఊహాగానాలు

కోలీవుడ్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన తెరజంటల్లో దళపతి విజయ్, త్రిష జోడీకి ప్రత్యేక స్థానం ఉంది. పలు విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించిన ఈ ఇద్దరి మధ్య ఉన్న తెరపై కెమిస్ట్రీ ఎప్పుడూ అభిమానులను ఆకట్టుకుంది. అయితే గత కొంతకాలంగా వీరి వ్యక్తిగత అనుబంధంపై కూడా సామాజిక మాధ్యమాల్లో రకరకాల ప్రచారాలు సాగుతున్నాయి. తాజాగా విజయ్ పుట్టినరోజు సందర్భంగా త్రిష ఎలాంటి శుభాకాంక్షల సందేశం పెట్టకపోవడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. దీంతో వీరిద్దరి మధ్య ఏమైనా దూరం పెరిగిందా అనే అనుమానాలు అభిమాన వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా విజయ్, త్రిషలు పలు కార్యక్రమాల్లో కలిసి కనిపించడం, ఒకరి సినిమాలకు మరొకరు మద్దతు ఇవ్వడం, వ్యక్తిగత వేడుకల్లో హాజరవడం వంటి పరిణామాలు అభిమానుల్లో ఆసక్తి పెంచాయి. ఈ క్రమంలో వీరిద్దరి స్నేహం కేవలం సహనటుల సంబంధాన్ని మించి ఉండొచ్చని సామాజిక మాధ్యమాల్లో ఎన్నో కథనాలు వెలువడ్డాయి. అదే సమయంలో విజయ్ వ్యక్తిగత జీవితంపై కూడా పలు ఊహాగానాలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ అంశాలపై విజయ్ గానీ, త్రిష గానీ ఎప్పుడూ బహిరంగంగా స్పందించలేదు. అధికారిక ప్రకటనలేమీ లేకపోయినా, వీరి గురించి వచ్చే ప్రతి చిన్న పరిణామం అభిమానుల్లో పెద్ద చర్చకు దారి తీస్తూనే ఉంది. ఈసారి విజయ్ పుట్టినరోజు సందర్భంగా సినీ ప్రముఖులు, అభిమానులు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక మాధ్యమాలు విజయ్‌కు సంబంధించిన పోస్టులు, చిత్రాలు, వీడియోలతో నిండిపోయాయి. ఇలాంటి సమయంలో ప్రతి ఏడాది విజయ్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు చెప్పే త్రిష ఈసారి పూర్తిగా మౌనం పాటించడం అందరి దృష్టిని ఆకర్షించింది. త్రిష సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ తరచూ తన చిత్రాల అప్‌డేట్లు, వ్యక్తిగత ఫొటోలు పంచుకుంటూ ఉంటారు. అలాంటి త్రిష విజయ్ పుట్టినరోజు వంటి సందర్భంలో స్పందించకపోవడంతో అభిమానుల్లో పలు రకాల వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారాల ప్రకారం విజయ్ ప్రస్తుతం తన కుటుంబ జీవితం, రాజకీయ బాధ్యతలపై మరింత దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో త్రిష కూడా వ్యక్తిగత అంశాల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తూ కొంత దూరం పాటిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ ఇప్పటివరకు కేవలం ప్రచారాలుగానే మిగిలాయి. విజయ్ లేదా త్రిష తరఫున ఎలాంటి స్పష్టత రాకపోవడంతో నిజానిజాలు తెలియని పరిస్థితి నెలకొంది. కొందరు అభిమానులు త్రిష ఈసారి శుభాకాంక్షలు చెప్పకపోవడాన్ని సాధారణ విషయంగానే తీసుకుంటుండగా, మరికొందరు మాత్రం దీనిని ఇద్దరి మధ్య సంబంధాల్లో మార్పుకు సంకేతంగా భావిస్తున్నారు. మొత్తానికి విజయ్-త్రిష పేర్లు మరోసారి సామాజిక మాధ్యమాల్లో చర్చకు రావడానికి ఈ ఒక్క విషయం చాలిపోయింది. అయితే సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన ప్రచారాల విషయంలో అధికారిక సమాచారం వచ్చే వరకు జాగ్రత్తగా వ్యవహరించడం అవసరమని సినీ వర్గాలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం విజయ్ రాజకీయాల వైపు అడుగులు వేస్తూ కొత్త బాధ్యతల్లో నిమగ్నమై ఉండగా, త్రిష వరుస సినిమాలతో తన కెరీర్‌ను ముందుకు తీసుకెళు తున్నారు. ఇలాంటి సమయంలో వ్యక్తిగత ప్రచారాల కంటే వారి వృత్తి జీవితానికే ప్రాధాన్యం ఇవ్వాలన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

# ‘మా ఇంటి బంగారం’ బృందాన్ని అభినందించిన చిరంజీవి

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన ‘మా ఇంటి బంగారం’ చిత్రం విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతోంది. జూన్ 19న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమాకు సానుకూల స్పందన రావడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి వసూళ్లు నమోదవుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సమంత, రాజ్ నిడిమోరు దంపతులతో పాటు దర్శకురాలు నందిని రెడ్డి, యూనిట్ సభ్యులను తన నివాసానికి ఆహ్వానించిన ఆయన సినిమా విజయంపై శుభాకాంక్షలు తెలిపారు. సినిమా వీక్షించిన అనంతరం చిరంజీవి తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ ‘మా ఇంటి బంగారం’ ఎంతో ఆసక్తికరంగా అనిపించిందని పేర్కొన్నారు. ఉమ్మడి కుటుంబం నేపథ్యంగా యాక్షన్, భావోద్వేగాలను చక్కగా మేళవిస్తూ దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో చిత్రాన్ని వినోదాత్మకంగా మలిచారని ప్రశంసించారు. కుటుంబ బంధాలు, అనుబంధాలు, భావోద్వేగాలు కలిసిన కథను ఆకట్టుకునే రీతిలో తెరపై ఆవిష్కరించారని ఆయన అభినందించినట్లు సమాచారం. కథనం నడిపించిన తీరు, పాత్రల మలుపులు, వినోదాన్ని జోడించిన విధానం చిత్రానికి ప్రధాన బలంగా నిలిచాయని చిరంజీవి అభిప్రాయపడ్డారని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. సమంత నటనపై కూడా చిరంజీవి ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా చీరకట్టులో ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని, భావోద్వేగ దృశ్యాల్లోనూ సమంత తన పాత్రకు పూర్తి న్యాయం చేశారని కొనియాడినట్లు సమాచారం. మహిళా ప్రాధాన్య చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు అవసరమని, అలాంటి కథలకు ప్రేక్షకులు కూడా ఆదరణ చూపుతున్నారని ఆయన



అభిప్రాయపడ్డారని చెబుతున్నారు. ఈ విజయానికి సమంత, నందిని రెడ్డి, రాజ్ నిడిమోరు సహా మొత్తం చిత్ర బృందం అభినందనలకు అర్హులని చిరంజీవి పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇక సమంత వ్యక్తిగత జీవితంపై కూడా చిరంజీవి చేసిన ఒక వ్యాఖ్య ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారి తీసింది. జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న సమంత, రాజ్ దంపతులకు ప్రత్యేక అభినందనలు అని ఆయన చెప్పిన మాటలను కొందరు అభిమానులు వేర్వేరు రీతుల్లో అర్థం చేసుకుంటున్నారు. అయితే ఆ వ్యాఖ్యకు సంబంధించి ఎలాంటి అధికారిక స్పష్టత లేకపోవడంతో సామాజిక మాధ్యమాల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. సమంత గర్భధారణ గురించి చిరంజీవి పరోక్షంగా సంకేతం ఇచ్చారా అనే చర్చ కూడా కొన్ని వర్గాల్లో కనిపిస్తోంది. అయితే దీనిపై సమంత, రాజ్ నిడిమోరు లేదా చిరంజీవి తరఫున ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అందువల్ల ఈ తరహా ప్రచారాలను జాగ్రత్తగా మాత్రమే చూడాల్సిన అవసరం ఉంది. మొత్తంగా చూస్తే ‘మా ఇంటి బంగారం’కు లభిస్తున్న ఆదరణ, సమంత నటనకు వస్తున్న ప్రశంసలు, ఇప్పుడు చిరంజీవి అభినందనలు కలిసి ఈ చిత్రానికి మరింత ప్రచారం తీసుకొచ్చాయి. మొదటి రోజునుంచే కుటుంబ నేపథ్యం, భావోద్వేగ సన్నివేశాలు, యాక్షన్ మేళవింపుతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా, సమంత కెరీర్‌లో మరో గుర్తుండిపోయే చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణతో పాటు పరిశ్రమ ప్రముఖుల ప్రశంసలు కూడా బలాన్నిస్తున్నాయి.

# బాహుబలి: ది ఎటర్నల్ వార్

## కీలక అప్‌డేట్‌ను అందించిన ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు మరో సర్‌ప్రైజ్ అందించారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న కొత్త యానిమేషన్ ప్రాజెక్ట్ 'బాహుబలి: ది ఎటర్నల్ వార్'కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను ప్రభాస్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ అభిమానుల్లో భారీ ఆసక్తిని పెంచారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యానిమేషన్ రూపంలో ప్రభాస్ యోధుడి అవతారంలో కనిపించడం అభిమానులకు గూస్‌బంప్స్ కలిగిస్తోంది. 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక యానిమేషన్ ఉత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఫ్రాన్స్‌లోని 'అన్నెసీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026'లో 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' ఎంపిక కావడం భారతీయ సినీ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. ఈ ఫెస్టివల్‌లో నిర్వహించే 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' సెషన్‌లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా యానిమేషన్ రంగానికి చెందిన ప్రముఖులు, స్టూడియోలు, నిర్మాతలు, దర్శకుల సమక్షంలో ఈ ప్రాజెక్ట్ ప్రదర్శించబడనుండటం విశేషం. ప్రభాస్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఆయన చేసిన పోస్ట్ కొద్ది నిమిషాల్లోనే లక్షలాది లైక్స్, వేలాది కామెంట్లను సొంతం చేసుకుంది. ఈ యానిమేషన్ చిత్రాన్ని ఆర్కా మీడియా వర్క్స్ నిర్మిస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈ ప్రాజెక్ట్‌కు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ యానిమేషన్ దర్శకుడు ఇషాన్ శుక్లా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రభాస్ తన పోస్ట్‌లో .. బాహుబలి: ది ఎటర్నల్ వార్ ప్రాజెక్ట్ అన్నెసీ యానిమేషన్ ఫెస్టివల్‌కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. మా టీమ్ నిజంగా అద్భుతమైన పనిని చేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రపంచం ఎప్పుడెప్పుడు చూస్తుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని పేర్కొన్నారు.





# రామ్ సినిమాలో నివేదా?

టాలీవుడ్‌లో తనదైన నటనతో పాటు గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి నివేదా పేతురాజ్ మరో క్రేజీ అవకాశాన్ని దక్కించుకున్నట్లు సమాచారం. ‘మెంటల్ మదిలో’ చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి, ఆ తర్వాత విభిన్న పాత్రలతో ప్రేక్షకుల మనసు గెలుచుకుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న రాబోయే కొత్త చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైనట్లు ఫిల్మ్ నగర్‌లో గట్టిగా ప్రచారం జరుగుతోంది. నివేదా పేతురాజ్ ఇప్పటికే తెలుగులో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. ‘చిత్రలహరి’, ‘బ్రోచేవారెవరురా’, ‘అల వైకుంఠపురములో’ వంటి చిత్రాల్లో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. అలాగే ‘బ్లడీ మేరీ’ వంటి ఓటీటీ చిత్రం, ‘విరాట పర్వం’, ‘దాస్ కా ధమ్కీ’ వంటి చిత్రాల్లో కూడా విభిన్నమైన పాత్రల్లో నటించి తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఇటీవల వచ్చిన ‘సింగ్ గీతం’ చిత్రంతో కూడా ఆమె ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఇప్పుడు రామ్ పోతినేని సరసన నటించే అవకాశం లభిస్తే ఇది ఆమె కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా మారుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. రామ్ పోతినేని ఎనర్జీకి తగ్గట్టుగా కథానాయిక పాత్రను కూడా దర్శకుడు బలంగా రూపకల్పన చేసినట్లు సమాచారం. ఈ చిత్రంలో నివేదా పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# ఆదర్శకుటుంబం ఆలస్యం అవుతోందా ?

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న క్రేజీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47. సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేయ-బోతున్నట్లు ఇటీవల వార్తలు వినిపించాయి. కానీ పరిస్థితులు చూస్తుంటే అందుకు అనుగుణంగా లేవు అనే టాక్




వినిపిస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఈ సినిమా విడుదలపై ఒక షాకింగ్ గాసిప్ గట్టిగా వినిపిస్తోంది. ఈ మోస్ట్ అవేటెడ్ మూవీ అనుకున్న సమయానికి రావడం లేదని వాయిదా పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని టాక్ నడుస్తోంది. ఈ సినిమా షూటింగ్ లో కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయని, కొన్ని సీన్స్ రీ షూట్ చేస్తున్నారని అక్టోబర్ 2లు షూటింగ్ ఫినిష్ అయ్యే అవకాశం లేదని టాక్. ఒకవేళ ఈ అక్టోబర్ లాంగ్ వీకెండ్ డేట్‌ను గనుక మేకర్స్ మిస్ చేసుకుంటే.. ఆ తర్వాత ఈ ఏడాదిలో సరైన విండో దొరకడం కష్టమేనని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com